

మొంథా తుఫాను కారణంగా 27, 28, 29 తేదీల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, అవసరం లేనప్పుడు బయటకు రాకూడదు. ప్రభుత్వ అధికారులు ప్రతి జిల్లాలో సురక్షిత చర్యల కోసం నియమించబడ్డారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

సోమవారం 27.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 190 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# మన్యం ఆశ్రమాల్లో విలవిలలాడుతున్న చిన్నారులు !

- పుస్తకాల కంటే ఆకలే పెద్ద సమస్యగా మారిన ఆశ్రమ పాఠశాలలు
- వెలుగు కావాలనే తపన, కానీ చీకట్ల మధ్యే బతుకుతున్న మన్యం పిల్లలు
- చిన్న చేతుల్లో పుస్తకాలు కాదు, కన్నీళ్లు పట్టిన ఆశ్రమ విద్యార్థులు
- ఆశ్రమ పాఠశాలల్లో నిర్వాకం - అధికారుల కళ్లకు కనిపించని దుస్థితి
- మన్యం ఆశ్రమ పాఠశాలల్లో ఆందోళనకర వాస్తవాలు వెలుగులోకి...



**జర్నలిస్ట్ ఫైల్ ప్రత్యేక ప్రతినిధి** : రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ రకరకాల వ్యాధులతో హాస్టల్ విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్న దుస్థితి కళ్లముందే కనపడుతోంది. జ్వరాలు వెంటాడుతున్నాయి. పౌష్టికాహార లోపంతో చిన్నారులు కునారిల్లుతున్నారు. హాస్టళ్లలోని వసతుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది! రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ పార్వతీపురం మన్యం జిల్లా మన్యంలో హాస్టల్ విద్యార్థుల కన్నీటి వెతలపై క్షేత్రస్థాయి పరిశీలన ఇది!

పోషక విలువలు లేని తిండి. ఒకే పళ్లెంలో ఏకకాలంలో ఇద్దరేసి చొప్పున తినాల్సిన దుస్థితి. కటిక నేలపై నిద్రించాల్సిన పరిస్థితి. మిర్చి, పోపు కూడా లేకుండా చేసిన నీళ్ల చారు. గుడ్డును పసుపు నీటిలో ఉడకబెట్టి కలరింగ్! తినడానికి కనీస వసతి లేకపోవడంతో ఆరుబయటే కుక్కలతో కలిసి భోజనాలు... ఇవి సాలూరు పరిధిలోని తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కనిపించిన దృశ్యాలు. శిథిలావస్థలో ఉన్న భవనంలో తినడానికి భయపడి ఆరుబయటే విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వర్షం పడి బురదతో నిండి ఉన్నా అక్కడే భోజనాలు చేయకతప్పని స్థితి వారిది! బురదలోనే కొందరు మోకాళ్లపై కూర్చుని తినడం కనిపించింది. అంతకన్నా ఒకే ప్లేట్‌లో ఇద్దరేసి విద్యార్థులు తింటున్న దృశ్యం విస్మయం కలిగిస్తుంది. ఎక్కువ మంది విద్యార్థులు ఇలాగే తింటున్నారు. 'ఇదేమిటి' అని విద్యార్థులను ప్రశ్నిస్తే 'పళ్లేలు లేవు' అని జవాబిచ్చారు! ఒకవైపు విద్యార్థుల సంక్షేమం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నామంటూ ప్రకటిస్తున్నా విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా కంచాలు కొనడానికి నిధులు లేని దుస్థితి ఏమిటో అర్థం కాదు. ఆ రోజు వారికి చారు, గుడ్డు మాత్రమే పెట్టారు! చారంటే దాదాపుగా ఉత్త నీరే! అందులో ఉల్లి, మిరప, పోపులు వంటివి మచ్చుకు కూడా కనిపించలేదు. ఇక గుడ్డు చూడగానే నూనెలో వేసి వేయించినట్లుగా కనపడింది. కానీ, కాదు.. అలా కనిపించేందుకు పసుపు నీళ్లలో ఉడకబెట్టి ఇచ్చారు! 'ఎప్పుడూ ఇలానే ఇస్తారన్నా' అన్నది విద్యార్థుల మాట! ఇంతకూ అవసరమైన నూనె సరఫరా అవుతోందో లేదో! అక్కడే నిండా నాచుబట్టి, బీటలు వారుతున్న ఒక శిథిల భవనంలో వంటలు వండుతున్నారు. విద్యార్థులు తింటే ఆ భవనంలో తినాలి.. లేకపోతే ఆరుబయట తినాలి! శిథిల భవనంలో తినడానికి భయపడుతున్న చిన్నారులు ఆరుబయటకే మొగ్గు చూపుతున్నారు. ఆరుబయలు కాబట్టి కుక్కలు వచ్చి చేరుతాయి.. అలాగే తినాలి! అవి అరిచినా... కరిచినా సర్దుకుపోవాలి.. తప్పదు! ఈ పరిస్థితుల్లో విద్యార్థులను పౌష్టికాహార లోపం, రక్తహీనత వెంటాడుతోంది! జ్వరాలతో బాధపడుతున్నారు. గత గురువారం కూడా బడ్నాన ప్రవీణ్ సహా ఎనిమిది మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. నెల రోజుల క్రితం బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లిన గెమ్మిల సునీల్ పాముకాటుకు గురికావడంతో విజయనగరంలోని ఆస్పత్రికి హడావుడిగా తీసుకెళ్లాల్సి వచ్చిందని, మిగతా 2లో...

## 361 బస్సులపై కేసులు, 40 సీజ్





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కర్నూలు బస్సు ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ ఆర్టీఏ తనిఖీలు విస్తృతం చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించి 361 బస్సులపై కేసులు నమోదు చేశారు. మరో 40 బస్సులను సీజ్ చేశారు. 63 బస్సుల్లో సీటింగ్ మార్పులు జరిగినట్లు గుర్తించారు.

ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేయని బస్సులకు భారీగా జరిమానా విధించారు. 83 బస్సులపై కేసులు నమోదు చేశారు. అత్యవసర ద్వారాలు లేని 11 బస్సులపై కేసులు నమోదు చేశారు. రక్షణ వ్యవస్థ లేని 14 బస్సులను గుర్తించారు. అనుమతి లేకుండా గూడ్స్, పార్సిళ్లను తీసుకెళ్లే 11 బస్సులపై జరిమానా విధించారు. నంద్యాల జిల్లాలో అత్యధికంగా 66, ఎన్టీఆర్ జిల్లాలో 42, పల్నాడు జిల్లాలో 36, ప్రకాశం జిల్లాలో 34, తిరుపతి జిల్లాలో 25, అన్నమయ్య జిల్లాలో 21, కర్నూలు జిల్లాలో 14, చిత్తూరు జిల్లాలో 8, ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు అయ్యాయి. మిగతా 2లో...

## 'మొంథా' తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంకండి


- విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణ మరమ్మతులు
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ తీసుకున్నారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ–ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ ప్రాంతం వరకు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర జిల్లాలలో మోహరించామని వెల్లడించిన ముఖ్యమంత్రి... తుఫాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు.

**పవర్ సా, జేసీబీలు, క్రేన్లు సిద్ధం చేయండి :** రాష్ట్రవ్యాప్తంగా 27,000 సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుఫాన్ రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. అయితే తుఫాన్ రక్షణ చర్యలపై ఇప్పటివరకు 11 సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, మిగతా 2లో...

## అమరావతి పనులను మెచ్చిన ప్రపంచబ్యాంక్ !



- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలపై ప్రపంచ బ్యాంకు బృందం.సంతృప్తి
- వేగంగా సాగుతున్న పనులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అమరావతిలో జరుగుతున్న పనులపై ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సహా ఆర్థిక సాయం చేస్తున్న సంస్థలన్నీ సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పనులను ఆయా ఆర్థిక సంస్థలకు చెందిన ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. పనులు చాలా వేగంగా జరుగుతూండటంతో ఆ నివేదికల ప్రకారం నిధులు విడుదల చేస్తున్నారు. డిసెంబర్ లో మరో రెండు వేల కోట్ల రూపాయల వరకూ ప్రపంచబ్యాంక్ విడుదల చేయనుంది.

అమరావతికి ప్రభుత్వం తన ఖజానా నుంచి పైసా కూడా ఖర్చు పెట్టడం లేదు. అంతా ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ తో పాటు కేంద్రం ఇచ్చే గ్రాంట్లతో నిర్మాణం అవుతోంది. అంతర్జాతీయ బ్యాంకులు ఇచ్చే నిధుల రీపేమెంట్ కేంద్రం చూసుకుంటుంది. మిగతా 2లో...

## సాంకేతికత సాయంతో తుఫాను నష్ట నివారణకు చర్యలు



- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాం
- ఎటువంటి ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేశాం
- రాష్ట్ర హెూమ్ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అత్యాధునిక సమాచార సాంకేతికత సాయంతో 'మొంథా' తుపాను నష్టనివారణకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందని రాష్ట్ర హెూమ్ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆదివారం తాడేపల్లి లోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరము ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మిగతా 2లో...

## 'ఉపాధి' పనుల్లో అక్రమాలకు చెక్

## నవంబరు 1 నుంచి ముఖ ఆధారిత హాజరు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలను కట్టడి చేసేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది. దొంగ మస్తర్లను నిరోధించేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ అధికారుల భాగస్వామ్యం, పర్యవేక్షణను తప్పనిసరి చేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తీసుకురానుంది.

ఇందులో భాగంగా నవంబరు 1 నుంచి వేతనదారుల ముఖ హాజరు తీసుకోవాలని సన్నాహాలు చేస్తోంది. మిగతా 2లో...

## ఇకపై ఇల్లు నాణ్యంగా ఉంటేనే బిల్లు

## ప్రత్యేక యాప్ రూపకల్పన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పేదల కోసం కాంట్రాక్టర్లు చేపట్టే ఇళ్ల నిర్మాణం నాణ్యాంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇల్లు నాణ్యంగా ఉంటేనే బిల్లులు చెల్లించనుంది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కాలనీల్లో ఆప్షన్–3 కింద కాంట్రాక్టర్లు కాలనీల్లో నాణ్యత లేకుండా నాసిరకంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చాలా చోట్ల పూర్తి కాకుండానే పునాదులు చెదిరిపోయాయి. మిగతా 2లో...

## పోలవరం నిర్వాసితులకు త్వరలో రూ.1,100 కోట్లు !



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం ప్రాజెక్టు పునరావాసం పనులు వేగవంతానికి మరో ముందడుగు పడింది. ప్రాజెక్టు పూర్తికి ప్రధాన అడ్డుగా ఉన్న పునరావాసం సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రూ. 1,100 కోట్లను పోలవరం సింగిల్ నోడల్ ఖాతాకు జమచేసింది. ఖజానాలో సొమ్ములు సిద్ధం చేసుకుని ఆ మేరకు త్వరలో చెల్లింపులు చేపట్టనున్నారు. ఈ నిధులతో పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, భూమి కొనుగోలు, గుత్తేదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు చేపట్టనున్నారు.

**తొలిదశ పునరావాసానికి అడుగులు:** ప్రాజెక్ట్ తొలి దశను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తున నీళ్లు నిలబెట్టేందుకు అవసరమైన స్థాయిలో నిర్మాణాలన్నీ 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నారు. అయినప్పటికీ 41.15 మీటర్లకి నీళ్లు నిలబెట్టేందుకు అవసరమైన మేర మాత్రమే పునరావాస పనులు చేపట్టనున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాక 2007లో తొలిసారి భూసేకరణ జరిపారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో 7 మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం, తూర్పు గోదావరి జిల్లాలోని దేవీపట్నం మండలాలను నిర్వాసిత ప్రాంతాలుగా గుర్తించారు. మిగతా 2లో...

## 'తుఫాన్' సమయంలో వ్యాధుల నియంత్రణకు మూడు అంచెల వ్యూహం!

- సంసిద్ధత, ప్రతిస్పందన, ఇతర చర్యలపై కొత్త విధానాలు
- మంత్రి సత్యకుమార్ అదేశాల మేరకు రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** తుపాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా ప్రామాణిక నిర్వహణ విధానాలు (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్స్) రూపొందించింది. తుపాన్ రాకముందు వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులవారీగా సంసిద్ధత ఎలా ఉండాలి? వచ్చినప్పుడు వైద్యులు ఎలా స్పందించాలి? అనంతరం వ్యాధులు ప్రబలకుండా, పునరావాస, ఇతర చర్యలు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో తీసుకోవాలన్న దాని గురించి 7 పేజీల్లో వైద్య శాఖ వివరించింది.

రాష్ట్రానికి మొంథా' ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పూర్వ ఉత్తర్వులను సమీక్షించి, డిజాస్టర్ మేనేజ్మెంటు (విపత్తు నిర్వహణ), వాతావరణ కేంద్రం అధికారులతో సంప్రదించి రూపొందించిన ప్రామాణిక నిర్వహణ విదానాల్లో.. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక, ప్రాంతీయ, జిల్లా, భోదనాసుపత్రుల వరకు సంస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలు వైద్య ఆరోగ్య శాఖ వివరించింది. మంత్రి సత్యకుమార్ ఆమోదంతో వీటిని జిల్లాలకు వైద్య ఆరోగ్య శాఖ పంపింది. వీటిని తప్పకుండా అనుసరించాలని జిల్లా అధికారులకు మంత్రి సత్యకుమార్ స్పష్టంచేశారు. మిగతా 2లో...

# 'మొంథా' తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంకండి



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు - పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

**సముద్రంలో పడవలు వెనక్కి రప్పించండి :** మరోవైపు పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయ శాఖ–ఆర్టీజీ వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 82 మెకనైజ్డ్ పడవలు, 37 మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి మొంథా తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని... ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# అమరావతి పనులను మెచ్చిన ప్రపంచబ్యాంక్ !

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆయా సంస్థలు వెంటనే డబ్బులు బదిలీ చేయవు. జరుగుతున్న పనుల్ని బట్టి మాత్రమే ఆర్థిక సాయం చేస్తాయి. అందుకే ప్రతి నెలా.. అమరావతిలో పనుల్ని ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధి బృందాలు పరిశీలిస్తాయి.

అమరావతిలో ఈ సారి ఎలాంటి ల్యాగ్ ఉండదని.. వేగంగా పనులు జరుగుతున్నాయని.. అది కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయని ప్రపంచబ్యాంక్ బృందం ప్రశంసించింది. అందుకే తదుపరి విడత నిధులు డిసెంబర్‌లో మంజూరు చేస్తున్నారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు నేరుగా చెల్లింపులు చేస్తారు. అందుకే పనులు 24/7 జరుగుతున్నాయి.

**పనులు జరిగితే నిధులకు కొరత ఉండదు ! :** అమరావతిలో పనులు ఆగకుండా సాగితే నిధుల సమస్యే ఉండదు. అయితే అమరావతిపై కుట్రలు చేయడానికి చాలా మంది కాచుకుని కూర్చున్నారు. వారి కుట్రల్ని భగ్నం చేస్తూ.. ప్రభుత్వం శరవేగంగా నిర్మాణం చేస్తోంది. ఇప్పటికే సీఆర్డీఏ ఆఫీసు.. ప్రారంభమయింది. వచ్చే నాలుగైదు నెలల కాలంలో చాలాభవనాలు అందుబాటులోకి వస్తాయి. మరో ఏడాదిన్నరలో ఐకానిక్ టవర్లను కూడా పూర్తి చేసే అవకాశం ఉంది.

# సాంకేతికత సాయంతో తుఫాను నష్ట నివారణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వం హై అలెర్ట్ గా ఉందన్నారు. గతంలో సంభవించిన తుఫాన్ల సందర్భంగా ఎదుర్కొన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పతిష్టమైన ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎటువంటి ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి రాష్ట్ర అధికారులతో పలుమార్లు కాన్ఫరెన్స్ లు నిర్వహించి అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఇదే అంశంపై గత నాలుగు రోజుల నుండి రాష్ట్ర ప్రజలను పలు మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా తక్షణ చర్యలు చేపట్టేందుకు అన్ని జిల్లాలకు నోడల్ అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. 6 ఎన్ డి ఆర్ ఎఫ్, 13 ఎస్డీ ఆర్ఎఫ్ టీమ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. హెలికాప్టర్ లతో నావెల్ అధికారులను సిద్ధం చేయడం జరిగిందని, అన్నిచోట్ల హెలీపాడ్లను కూడా సిద్ధం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అవసరం అయితే బెంగళూరు, చెన్నై మరియు హైదరాబాద్ నుంచి కూడా హెలికాప్టర్ లను తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తీరాప్రాంతాల్లో 14 బోట్లను కూడా సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ తుఫాను సందర్భంగా గంటకు 100 కిలోమీటర్ల పైబడి భారీ గాలులు వీచే అవకాశం ఉన్నందున, ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని రకాల హోర్డింగ్లను తొలగించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. తుఫాను కు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ఎవరూ నమ్మవద్దని, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ల టోల్ నెంబర్ కు ఫోన్ చేసి స్పష్టమైన సమాచారం తెలుసుకోవచ్చని, తక్షణ సహాయం కూడా పొందవచ్చు అని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తక్షణ సహాయం అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆమె విజ్ఞప్తి చేశారు.

స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఇకపై ఇల్లు నాణ్యంగా ఉంటేనే బిల్లు ప్రత్యేక యాప్ రూపకల్పన

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ఇల్లు గోడలు దెబ్బ తిన్నాయి. ఇలా నిర్మాణాలు నాసిగా ఉన్నా గతంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు యథేచ్ఛగా కొనసాగింది. ఇకపై ఇళ్ల నిర్మాణం నాణ్యంగా ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. తూతూమంత్రంగా కడితే కుదరదని తేల్చి చెప్పింది. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు అందరికీ తనిఖీ బాధ్యతను అప్పగించింది. అధికారులు ధ్రువీకరించాకే బిల్లులు విడుదల కానున్నాయి. అధికారులు కాలనీల సందర్శన, ఇళ్ల తనిఖీల ఫొటోలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం తీసుకు వచ్చింది.క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే : కొన్నిచోట్ల ఆప్షన్–3 కింద కాలనీల్లో కాంట్రాక్టర్లు చేపడుతున్న ఇళ్ల నిర్మాణ తీరును పరిశీలించకుండానే పూర్తయినట్లు క్షేత్రస్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. కాలనీలకు వెళ్లి పరిశీలించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ చూస్తున్నారు. అప్పుడప్పుడూ గృహనిర్మాణ శాఖ అధికారులు వెళ్లి పరిశీలిస్తున్నారు. నాణ్యత సరిగా లేకున్నా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీన్ని అరికట్టేందుకు గృహనిర్మాణ శాఖకు చెందిన ఏఈ స్థాయి అధికారి నుంచి పీడీ(డీహెచ్) వరకు క్షేత్రస్థాయికి వెళ్లి పేదలకు కాంట్రాక్టర్లు నిర్మించి ఇస్తున్న ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

స్థానికంగా ఉండే ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్) తన పరిధిలో నిర్మితమవుతున్న ఇళ్లకు ఆన్‌లైన్‌లో బిల్లు పెట్టాలంటే అన్ని ఇళ్లనూ పక్కాగా 100 శాతం పరిశీలించాలి. వాటిలో డీఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) 30 శాతం ఇళ్లను, ఈఈ (ఎలక్ట్రానిక్ ఇంజినీర్) 15 శాతం, పీడీ (పోలీస్ డిపార్ట్?మెంట్) 5 శాతం ఇళ్లను ర్యాండమ్‌గా తనిఖీ చేయాలి. వారందరూ ధ్రువీకరించిన తర్వాతే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 11,791 ఇళ్లకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అధికారులు ఇప్పటికే ఈ ఇళ్ల నాణ్యత పరిశీలనను ప్రారంభించారు.

# మన్యం ఆశ్రమాల్లో విలవిలలాడుతున్న చిన్నారులు !

(మొదటి పేజీ తరువాయి)

పర్మినెంట్ ఎఎన్ఎం లేకపోవడంతో చాలా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోందని వసతి గృహం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వసతి గృహంలో 320 మంది బాలురు ఉన్నారు. 3, 4వ తరగతుల విద్యార్థులకు రూ. 1,150, 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1,400 చొప్పున మెనూ ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ లెక్కన పూటకు రూ. 13 మాత్రమే. ఈ సొమ్ముతో నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం ఎలా పెట్టగలరో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

**మెను ఛార్జీల్లో కోత పెట్టి సర్దుబాటు చేస్తున్నాం:** ఈ వసతి గృహంలో ఎఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. దీంతో, విద్యార్థులు అనారోగ్యం బారిన పడినప్పుడు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఈ సమస్యను అధిగమించేందుకు నెలకు రూ. 6 వేలు చేతి డబ్బులు పెట్టి ఒక ఎఎన్ఎంను నియమించాం. ఆస్పత్రులకు తీసుకెళ్లినప్పుడు ఛార్జీలు, ఇతర ఖర్చులు కూడా ఇవ్వాల్సి వచ్చినప్పుడు తలకు మించిన భారం అవుతోంది. వసతి గృహంలో ఒకే ఒక్క కుక్ ఉన్నాడు. అదనంగా ఇద్దరు వంట మనుషులను నియమించుకుని, వీరికి కూడా చెరో రూ. 5 వేలు మేమే ఇచ్చుకుంటున్నాం. నెలకు రూ. 16 వేలు వార్డెన్ భరించాలంటే కష్టమే. ఈ నేపథ్యంలో మెను ఛార్జీల్లో కోతపెట్టి సర్దుబాటు



చేసుకొస్తున్నాం.

–మువ్వల లచ్చయ్య, హాస్టల్ వార్డెన్, తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాల

**పాచిపెంటలో పడకలూ కరువే! :** పాచిపెంట మండలం పద్మాపురం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ వసతి గృహంలో తరగతి గదులే పడక గదులు. మొత్తం ఇక్కడున్న 243 మంది విద్యార్థులు తాము కూర్చున్నచోటే పడుకోవాల్సిన దుస్థితి. మంచాలు లేకపోవడంతో కటిక నేలపైనే నిద్రిస్తున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే తరగతుల నిర్వహణ కష్టంగా ఉంటోంది. కిటికీలు ఊడిపోయాయి. వర్షాలు కురుస్తుండడంతో తరచూ పాములు, తేళ్లు వంటి విషసర్పాల బెడద ఎదుర్కొంటున్నారు. వంట గది, డైనింగ్ హాలు లేవు. చాలీచాలని మరుగుదొడ్లు ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తీవ్ర జ్వరంతో శంబర పిహెచ్‌సిలో సోమవారం చేరారు. వీరిలో ఎరుకులు అనే విద్యార్థికి జ్వరం అదుపులోకి రాకపోవడంతో పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు.

**కురుపాంలో భయం.. భయం :** కురుపాం గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థినులు భయపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా పంపడం లేదు. ఇక్కడ 609 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ వసతి గృహంలో అంజలి, కల్పన అనే ఇద్దరు విద్యార్థినులు పచ్చకామెర్లతో ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. అప్పట్లో కలెక్టర్ వారం రోజులపాటు సెలవు ప్రకటించారు. ఈ నెల 15న వసతి గృహం పున:ప్రారంభమైంది. ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే తిరిగి వచ్చారు. తాగునీరు, పరిశుభ్రత, వైద్యం, ఆరోగ్యం తదితరాలపై ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పంపేందుకు సాహసించడం లేదు. ఈ వసతి గృహం బోసిపోతోంది.

# 361 బస్సులపై కేసులు, 40 సీజ్

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు పాటించని 13 బస్సులు సీజ్?: పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా తిరుపతిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను విస్తృతంగా తనిఖీ చేసి నిబంధనలు పాటించని 13 బస్సులను సీజ్? చేశారు. ప్రయాణికుల భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలో 2 బృందాలు ఏర్పడిన రవాణా అధికారులు ప్రైవేటు బస్సుల తనిఖీ చేపట్టారు. నగరంలోని అయ్యప్పగుడి, కోవూరు జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న బస్సులను సీజ్ చేశారు. శనివారం నిర్వహించిన తనిఖీల్లో 16 బస్సులు సీజ్ చేయగా, ఆదివారం మరో 3 బస్సులను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు.

సీటింగ్‌కు అనుమతి తీసుకొని స్లీపర్‌గా: తాడేపల్లి వద్ద రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు స్లీపర్ బస్సుల్లో తీసుకుంటున్న ప్రమాద నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అత్యవసర ద్వారాలు, అగ్ని నివారణ పరికరాలు ఉన్నాయా లేదా పరిశీలించారు. పార్సిల్ సర్వీసులు అనుమతిస్తున్న బస్సులకు జరిమానా విధిస్తున్నట్లు అధికారులు వివరించారు.

అగ్నిప్రమాదం జరిగితే ఎలా తప్పించుకోవాలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విశాఖ మధురవాడ పరిసర ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రైవేటు బస్సులను తనిఖీలు చేశారు. సీటింగ్‌కు అనుమతి తీసుకొని స్లీపర్‌గా మార్చిన బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రవాణా శాఖ అధికారి బీ. రాజారావు తెలిపారు. మధురవాడ ప్రాంతంలో 4 బస్సులను సీజ్ చేసినట్లు వివరించారు. సరైన పత్రాలు లేని బస్సులకు రూ. 9 లక్షల వరకు జరిమానా విధించినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులకు పెరిగిన డిమాండ్ : మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ తనిఖీలు కొనసాగుతున్న నేపథ్యంలో పలువురు ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు బస్సులను రోడ్డెక్కించడం లేదు. రెండు రోజులుగా వందలాది ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను పార్కింగ్ ప్రాంతాలకే పరిమితం చేశారు. కొన్ని ట్రావెల్స్ బస్సులు మాత్రమే నడుస్తున్నా వాటిలో ప్రయాణించేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. కర్నూలు వద్ద బస్సు ప్రమాద దుర్ఘటనతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాల వైపు వెళ్లడం లేదు. ఫలితంగా ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. ప్రయాణికులతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ కిటకిటలాడింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 200కు పైగా బస్సు సర్వీసుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. దీంతో పలు ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

## 'ఉపాధి' పనుల్లో అక్రమాలకు చెక్ - నవంబరు 1 నుంచి ముఖ ఆధారిత హాజరు!

(మొదటి పేజీ తరువాయి)

ఈకేవైసీ నమోదును సంబంధిత క్షేత్ర సహాయకులు శరవేగంగా చేస్తున్నారు. ఇప్పటివరకు మస్తరు విధానం అమలులో ఉంది. శ్రామికుల హాజరు నమోదులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి ఈకేవైసీ నమోదు తోడ్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

80 శాతం వరకూ ఈకేవైసీ పూర్తి: శ్రీకాకుళం జిల్లాలో 7,26,779 మంది వేతనదారులు ఉన్నారు. వారిలో 5,94,704 మంది చురుగ్గా పనుల్లో పాల్గొంటున్నారు. 81 శాతం మేర నమోదు చేయగలిగారు. స్థానికంగా అందుబాటులో లేని వారిని గుర్తించి మరో వారంలోగా పూర్తి చేయడానికి డ్వామా సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ–కేవైసీ నమోదులో అగ్రభాగంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నాలుగైదు రోజుల్లో చురుగ్గా పని చేసే వేతనదారుల వివరాలు సేకరిస్తామని తెలిపారు.

ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి అవి పూర్తవుతాయి. అప్పటి నుంచి ఉపాధి పనులు వేగవంతమవుతాయి. వచ్చే నెల నుంచే ముఖ హాజరు అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు 7,26,001 మంది ఈకేవైసీ పూర్తి చేశారు. చురుగ్గా పనుల్లో పాల్గొంటున్న వారిలో 5,90,585 మంది వివరాల



నమోదు ప్రక్రియ పూర్తయింది.

వలస వెళ్లిన వారిని గుర్తిస్తున్నాం: ఉపాధి హామీ పథకంలో వేతనదారుల ఈకేవైసీ నమోదు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని డ్వామా పీడీ బి. సుధాకరరావు అన్నారు. ఇప్పటికే చివరి దశకు చేరుకున్నామని ఆయన వివరించారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో స్థానికంగా లేని వారిని గుర్తిస్తున్నామని వివరించారు. వివరాలు సేకరించి ఈకేవైసీ నమోదు చేసి నూతన విధానం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని (నరేగా) ఉపయోగించుకోవడంలో పురుషుల కంటే మహిళలే ముందున్నారు. జాతీయ స్థాయి సగటు కంటే అత్యధికంగా పనిదినాలు వినియోగించుకోవడంలో మహిళలు రికార్డు సృష్టిస్తున్నారు. గత ఏడాది (2024–25) జాతీయ స్థాయిలో సరాసరి పని దినాలు ఉపయోగించుకున్న మహిళలు 58.1% అయితే మన రాష్ట్రంలోనే ఇది 60.14 శాతంగా ఉండటం గమనార్హం. రాష్ట్రానికి గత ఏడాది కేటాయించిన 21.51 కోట్ల పని దినాల్లో మహిళలు 14.57 కోట్లకు పైగా ఉపయోగించుకున్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఏడాదిలో 100 రోజులపాటు ఉపాధి లభిస్తోంది. పనులకు హాజరు, పని దినాలు వినియోగించుకోవడంలో గతంలో వెనుక వరసలో ఉండే మహిళలు ప్రస్తుతం పరుగులు తీస్తున్నారు. ప్రత్యేకించి మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ మహిళలు ముందున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల్లో మహిళలు ఈ పనులకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు.

# పోలవరం నిర్వాసితులకు త్వరలో రూ.1,100 కోట్లు !

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం, దేవీపట్నం మండలాల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులకు అవసరమైన మేర భూసేకరణ, పునరావాసం మినహా మిగిలిన ప్రాంతాల్లో పెద్దగా పునరావాస చర్యలు అమలు కాలేదు.

2007 తర్వాత 2017లో మరోసారి భూసేకరణ చేశారు. ఆ తర్వాత పునరావాసం మళ్లీ పడకేసింది. గత జగన్ ప్రభుత్వంలో పునరావాసం మాట పూర్తిగా మరుగునపడింది. 5 ఏళ్లలో కేవలం గొమ్ముగూడెం గ్రామానికి తప్ప వందల ఆవాసాలకు పునరావాసం జాడే లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల కష్టాలు తీర్చే ప్రయత్నాలు ప్రారంభించింది. 2024లో పునరావాస ప్యాకేజీ కింద రూ. 104 కోట్లు జమ చేశారు. మళ్లీ ఇప్పుడు రూ. 1,100 కోట్లు పునరావాస కార్యక్రమాల చెల్లింపులకు సిద్ధమయ్యాయి.

ప్రణాళిక సిద్ధం చేసిన ప్రభుత్వం: తొలిదశ పునరావాసంలో భాగంగా 41.15 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేందుకు వీలుగా 1,00,099 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా 91156 ఎకరాల సేకరణ పూర్తయింది. ఇంకా 8943 ఎకరాలు సేకరణ పెండింగ్‌లో ఉంది. మొత్తం 38,060 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా ఇప్పటి వరకు 14,371 కుటుంబాల తరలింపు పూర్తి అయింది. మరో 23,689 కుటుంబాలను తరలించాలి. ఇందులో 2026 మార్చి నాటికి 6575 కుటుంబాలు 2027 మార్చి నాటికి 17,114 కుటుంబాలను తరలించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం 38,060 నిర్వాసిత కుటుంబాలకు గానూ ఇంతవరకు 19,953 కుటుంబాలకే పునరావాస ప్యాకేజీ అందించారు. మరో 18,107 కుటుంబాలకు ఈ ప్యాకేజీ అందించాల్సి ఉంది. 34,360 కుటుంబాలు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వాలని కోరగా 15,439 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 18,921 గృహాలు నిర్మించాల్సి ఉంది.

ప్రస్తుతం 771 నిర్వాసిత కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ కింద రూ. 71.06 కోట్లు చెల్లించాల్సి ఉంది. 10,701 ఇళ్ల నిర్మాణంతో పాటు గిరిజనులకు సాగు కోసం సిద్ధం చేసిన 4139 ఎకరాల భూమికి రూ. 828 కోట్లు చెల్లించాల్సి ఉంది. కాలనీలు నిర్మించిన గుత్తేదార్లకు బకాయిలు రూ. 208.48 కోట్లు కలిపి మొత్తం రూ. 1107.54 కోట్లు చెల్లించాల్సి ఉంది.

# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెరలకు ప్రాధాన్యం



**గోరంట్ల(జర్నలిస్ట్ ఫైల్):** పార్టీ, నామినేటెడ్ పదవులతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గీయులకు అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గోరంట్ల మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీలకు టీడీపీతోనేఆర్, రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బీసీల మనోభావాలకు గౌరవమిస్తూ, విశ్వకర్మ జయంతి, వాల్మీకి జయంతి, కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రేనాటి యోధుడు, అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య దాష్టీకాలను ఎదిరించి మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలికిన వడ్డే ఓబన్న జయంతిని కూడా అధికారికంగా నిర్వహించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ ఏడాది జనవరి 11న ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీల ఆత్మగౌరవానికి సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రాధాన్యమిస్తూ ఉంటారన్నారు. ఈ క్రమంలో బీసీల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందేది బీసీలేనన్నారు. పెనుకొండలో కూటమి అభ్యర్థిగా తన విజయంలో వడ్డెర సామాజిక వర్గీయులు కీలక భూమిక పోషించారని కొనియాడారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెరలకు ప్రాధాన్యం :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గీయులకు అధిక ప్రాధాన్యమివ్వనున్నామని మంత్రి సవిత తెలిపారు. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లోనూ వడ్డెర నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. వడ్డెరలకు క్వారీ కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లతో పాటు సీనరేజ్ ఫీజులో 50 శాతం రాయితీ కూడా అందిస్తామన్నారు. వడ్డెరలను ఎస్టీలో చేర్చే అంశం సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో ఉందన్నారు. వడ్డెరలను అన్ని విధాలా అభివృద్ధి చెందేలా సీఎం చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి సవిత వెల్లడించారు.

**విద్యతోనే ముందంజ :** వడ్డెరలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలంటే విద్య తప్పనిసరి అని మంత్రి సవిత వెల్లడించారు. వడ్డెరలు తమ బిడ్డలను ఉన్నత విద్య చదివేలా ప్రోత్సహించాలన్నారు. వడ్డెర సామాజిక వర్గీయుల వినతి మేరకు తన తండ్రి పేరు మీద ఉన్న ఎస్ఆర్ఆర్ ట్రస్టు ద్వారా సొంత నిధులతో గోరంట్ల మండల కేంద్రంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షులు శేఖర్ సాహు, టీడీపీ సీనియర్ నాయకులు దేవళ్ల మురళి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో వడ్డెర సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# 'తుఫాన్' సమయంలో వ్యాధుల నియంత్రణకు మూడు అంచెల వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

**పీహెచ్సీల్లో యాంటీ స్నేక్ వీనమ్, ర్యాబిస్ వ్యాక్సిన్లు సిద్ధంగా ఉండాలి :** ఆసుపత్రుల్లో అవసరాలకు సరిపడా యాంటీ బయాటిక్ మందులు, యాంటి స్నేక్ వీనమ్, 100 యాంటీ ర్యాబిస్ డోస్ లు నిల్వ ఉంచుకోవాలని తెలిపింది. ముఖ్య%శీ%గా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో యాంటీ స్నేక్ వీనమ్ 30 వయల్స్ కనీసం 500 మందికి సరిపడా యాంటీ బయాటిక్ మందులు, ఓఆర్ఎస్ ఫ్లూయిడ్స్ 500 ప్యాకెట్లు/200 బాటిల్స్ చొప్పున ఉండాలని స్పష్టంచేసింది. అనుపత్రుల సామర్థ్యానికి తగ్గట్లు అనుసరించాల్సిన విధానాల గురించి కొత్త ఎస్ఓపీలో వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. అలాగే... బాధిత ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, అంటు వ్యాధులు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఆయా శాఖలతో సమన్వయం ఎలా ఉండాలన్న దానిపై కూడా ప్రామాణిక విధివిధానాల్లో వివరించింది.

**రాష్ట్ర నోడల్ ఆఫీసర్ గా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ :** ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్రంలో తీసుకోవాల్సిన చర్యలపై పర్యవేక్షణ, సమన్వయ అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి వ్యవహరిస్తారు.

రాష్ట్ర సర్వైలెన్స్ ఆఫీసర్ అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎపిడమిక్ సెల్ 24 గంటలపాటు పనిచేయాలి.



తుపాన్ సమయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విపత్తు నిర్వహణ శాఖ, ఇతర శాఖల అధికారులతో రాష్ట్ర సెల్ లో ఉన్న సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితుల గురించి తెలుసుకుంటూ సదరు శాఖలతో సమన్వయంచేస్తూ బాధితులకు వైద్యసేవలను చేరువ వేయాలి.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ తో 'డిస్ట్రిక్ట్ ఎపిడమిక్ కంట్రోల్ రూం అనుసంధానం జరగాలి. భారతీయ వాతావరణ శాఖ నుంచి వచ్చే తుపాన్ హెచ్చరికలకు అనుగుణంగా ఎపిడమిక్ కేంద్రాల్లో ఉండే వారు తమ పరిధిలోని వారితో సంప్రదిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.

**వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలి**

అసుపత్రుల్లో వైద్యులు, ఇతర పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలి. ఆయా ప్రాంతాల్లోని గర్భిణులు, వృద్ధులు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కలిగిన వారి వివరాలు సిద్ధం చేసుకోవాలి. తుపాన్ కు, ప్రసవ అంచనా తేదీకి మధ్య 15రోజుల వ్యవధి కలిగిన గర్భిణుల వివరాలు సిద్ధంచేసుకోవాలి. తుపాన్ హెచ్చరికలకు అనుగుణంగా కనీసం 2 రోజుల ముందు దగ్గర్లోని ఆసుపత్రులకు వీరిని తరలించేలా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలి.

ప్రతి 50వేల జనాభాకు ఒక ఐడీఎస్పీ (సర్వైలెన్స్) అధికారిని అందుబాబులో ఉంచాలి

అనుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు, పారా మెడికల్, అంబులెన్సుల సిబ్బందిని సమన్వయం చేసుకునేలా వాట్సన్ గ్రూపులు ఏర్పాట్లు చేసుకోవాలి. సీహెచ్ఓలు, ఆశా వర్కర్లు, ఎ.ఎన్.ఎం.లు ప్రజల్లో ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. మంచినీరు, పారిశుధ్యం, ప్రాథమిక చికిత్సల గురించి వివరించాలి

'సైక్లోన్ షెల్టర్లలో ఏర్పాటుచేసే వైద్య శిబిరాల్లో ఒక వైద్యుడు, సీనియర్ నర్సు, కనీసం ఇద్దరు సారా మెడికల్ సిబ్బంది ఉండాలి.

108, 104, 102 అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలి. ఇంధన సమస్య తలెత్తకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి. తుపాన్ బాధిత ప్రాంతాల్లోని వారిని అవసరాలకు తగ్గట్లు సమీపంలోని సీహెచ్సీ వంటి ఆసుపత్రులకు తరలించేందుకు వీటిని రెడీ చేయాలి.

**వైద్య సేవలు వెంటనే అందించేలా సిద్ధంగా ఉండాలి:** తుపాన్ సమయంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలి. బాధిత ప్రాంతాలను గుర్తించి రోగులకు వైద్య సేవలు అందించాలి. సైక్లోన్ షెల్టర్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. ప్రతి 6 గంటలకు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తూ వచ్చిన వివరాలకు అనుగుణంగా వైద్య సేవలు కొనసాగాలి.

వరదలు సంభవించే ప్రాంతాల్లో బోటు క్లినిక్కులను సైతం సిద్ధంచేయాలి. మత్స్య శాఖ వారితో సంప్రదించి ఇందుకు సంబంధించిన ఏర్పాటు చేసుకోవాలి.


తుఫాన్ కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశాలున్నందున క్లోరిన్ మాత్రలు, జీచింగ్ పౌడరును స్థానికులకు అందించాలి. పంచాయతీ, గ్రామీణ నీటి పారుదల శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియ జరగాలి.

విద్యుత్తు సరఫరాకు అవరోధం ఏర్పడితే వెంటనే ఆసుపత్రుల్లో జనరేటర్ వినియోగించేలా ముందస్తు చర్యలు ఉండాలి. కనీసం 3 రోజుల పాటు జనరేటర్ వినియోగానికి తగ్గట్లు ఇంధనం నిల్వలో ఉండాలి.

ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ప్రతి స్పందన)లు సిద్ధంగా ఉండాలి. జిల్లా కేంద్రం మంచి వచ్చే అదేశాలకు అనుగుణంగా అవసరమైన ప్రాంతాలకు ఈ టీంలు వెళ్లాలి. డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తిచెందకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

# అల్లకల్లోలంగా సముద్రం - మచిలీపట్నంలో ఎగసిపడుతున్న అలలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుపాను ప్రభావంతో మచిలీపట్నంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీని ప్రభావంతో అలలు ఎగసిపడుతున్నాయి. మచిలీపట్నం బీచ్ వద్దనున్న దుకాణాలను సముద్రపు నీరు ముంచెత్తింది. తుపాను దృష్ట్యా బీచ్‌లోకి ఎవరూ వెళ్లకుండా మెరైన్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బాపట్ల జిల్లా చీరాలలో రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. చీరాల ఆర్డీవో కార్యాలయంలో కంట్రోలు రూము ఏర్పాటు చేశారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ ముందస్తు చర్యలు చేపట్టారు. నేటి నుంచి తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు బీచ్?లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు చెప్పారు. కార్తీకస్నానాలు ఆచరించేందుకు సముద్రతీరాలకు పర్యాటకులు రావద్దని, చీరాల మండలం వాడరేవుతో పాటు, రామాపురం, కటారివారిపాలెం, మోటుపల్లి, చినగంజాం బీచ్?లు మూసివేస్తున్నట్లు చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ తెలిపారు. నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు చెబుతున్నారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం: తుపాను దృష్ట్యా సహాయచర్యల కోసం ప్రత్యేకంగా అధికారులను ప్రభుత్వం నియమించింది. మొత్తం 19 జిల్లాలకు ప్రత్యేక, జోనల్ అధికారులను నియామించారు. శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు జోనల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అజయ్‌జైన్, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల జోనల్ అధికారిగా ఆర్.పి. సిసోదియా నియమితులయ్యారు.

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 8 కి.మీ. వేగంతో ఉంది. వాయుగుండం విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా 880 కి.మీ. దూరంలో వాయుగుండంగా కేంద్రీకృతమైంది. మరికొన్ని గంటల్లో తీవ్రవాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ పేర్కొంది. పశ్చిమ వాయవ్యంగా కదిలి ఇవాళ సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉంది. కాకినాడ సమీపంలో మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తీవ్రతుపాను తీరం దాటే అవకాశముంది. తుపాను తీరందాటే సమయంలో గంటకు 90-110 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి.

తుపాను దృష్ట్యా మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సోమవారం, మంగళవారం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు: మొంథా తుపాను దృష్ట్యా మంత్రి అచ్చెన్న అధికారులను అప్రమత్తం చేశారు. కోనసీమ, మన్యం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి అచ్చెనాయుడు మాట్లాడారు. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. కాలువలు, చెరువులు, నదులను నిత్యం పర్యవేక్షించాలని అచ్చెన్న వివరించారు. తుపాను దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని మంత్రి కోరారు. మొంథా తుపాను నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తం అయింది. విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదుకు అధికారులు ప్రత్యేక నంబర్లను ఏర్పాటు చేశారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసు నంబర్ 8331018762, విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదునకు టోల్‌ఫ్రీ నంబర్ 1912, అదే విధంగా అంతరాయంపై ఫిర్యాదునకు వాట్సాప్ నంబర్ 9493916192 లను సంప్రదించవచ్చు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని ప్రజలకు విద్యుత్‌శాఖ హెచ్చరించింది.

ప్రకాశంకు భారీగా వరద: మరోవైపు ఎగువ రాష్ట్రాల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు వస్తుంది. వరద ఉద్ధృతితో కృష్ణానది నిండికుండలా మారింది. ప్రకాశం బ్యారేజ్?లో 69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే లంక గ్రామాలను అప్రమత్తం చేశారు. బ్యారేజీలో ఇన్?ఫ్లో అవుట్ ఫ్లో 6 లక్షల 69 వేల క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజ్ వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

## 'మొంథా' తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** 'మొంథా' తుఫాను దృష్ట్యా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లాలో తుపాను ప్రభావం ఉండే అవకాశం నేపథ్యంలో కలెక్టర్ కీర్తి చేకూరికి ఫోన్ ద్వారా సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

ఎర్రకాలువ ప్రాంతాలు ముంపుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశించామని మంత్రి చెప్పారు. పంటలు నష్టపోకుండా రైతాంగానికి తగిన సలహాలు అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

జిల్లా ప్రజలకు వర్షాలు, గాలులు తీవ్రంగా ఉంటే ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని, టెలివిజన్, రేడియో, సోషల్ మీడియా వంటి అన్ని కమ్యూనికేషన్ మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేయాలని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని, ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలించబడేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తుపాను సమయంలో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి ప్రాథమిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని మంత్రి దుర్గేష్ అన్నారు. శాసనసభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేసి తుఫాను ప్రభావాన్ని తగ్గించేలా దృష్టి సారించాల్సిందిగా పిలుపునిచ్చారు.

## శ్రీశైలం దేవస్థానంలో నేడు లక్షదీపోత్సవం

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా శ్రీశైలదేవస్థానం నేడు సాయంత్రం ఘనంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతులను నిర్వహించనుంది. లోకకల్యాణం కోసం నిర్వహించే ఈ ఆధ్యాత్మిక వేడుకకు వేలాది మంది భక్తులు హాజరవుతారని దేవస్థానం అధికారులు తెలిపారు.

పుష్కరిణి పరిసర ప్రాంతం అంతా దీపాల వెలుగులతో నిండిపోయేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీస్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేయించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పుష్కరిణి తీరంలో దశవిధ హారతులు సమర్పించబడతాయి. ఇవి భక్తులకు దర్శనానందం, పుణ్యం ప్రసాదించే ముఖ్య శాస్త్రోక్త కార్యక్రమాలుగా నిర్వహించబడతాయి.

దశహారతుల్లో ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి భక్తులకు ప్రత్యేక ఫలితాలను ప్రసాదిస్తాయని దేవస్థానం పౌరోహిత్య విభాగం పేర్కొంది.

ఓంకారహారతి దర్శనంతో కష్టం తొలగిపోతుందని, నాగహారతి సర్పదోష నివారణగా, త్రిశూలహారతి అపమృత్యు దూరమయ్యేలా, నందిహారతి భయం తొలగించేలా చెబుతున్నారు. అలాగే సూర్య, చంద్ర హారతులు ఆయుష్షు, మనోశాంతిని ప్రసాదిస్తాయని, కుంభహారతి సంపద, నక్షత్రహారతి విజయ ఫలితాలు, కర్పూరహారతి పాపపరిహారం కలిగిస్తుందని విశ్వాసం.

పుష్కరిణి వద్ద శ్రీవారి మంగళవాద్యాలు, వేదఘోషాల నడుమ జరిగే ఈ హారతులు కార్తికమాసంలో శ్రీశైలంలో జరిగే అత్యంత విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమాలు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిసింది.

## మొంథా' తుఫాన్ ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి



**పార్వతీపురం(జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో, ఇతర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంతాలకు చేరుకొని జిల్లాల్లోని తుఫాన్ ప్రభావాన్ని పర్యవేక్షణ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని అధికారులను నిర్దేశించారు. చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నీటి సరఫరా విభాగం అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## కుటుంబసభ్యులకు మృతదేహాల అప్పగింత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కర్నూలు బస్సు ప్రమాదంలో మరణించిన వారిలో 18 మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. డిఎన్ఎ నివేదిక ఆధారంగా మృతదేహాలను అప్పగిస్తున్నట్లు వెల్లడడించారు. అక్కడి పరిస్థితిని జిల్లా కలెక్టర్ ఎ.సిరి పర్యవేక్షిస్తున్నారు. మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేస్తున్నామని అన్నారు. మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని అన్నారు. కర్నూలు బస్సు ప్రమాదంలో 19మంది మరణించిన సంగతి తెలిసిందే. 18 మృతదేహాలను అప్పగించామని, మరో గుర్తుతెలియని మృతదేహానికి డిఎన్ఎ పరీక్షను నిర్వహిస్తున్నామని కర్నూలు ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. చిత్తూరు నుండి ఒకరు వచ్చారని, డిఎన్ఎ పరీక్షలో వాస్తవం తేలుతుందని అన్నారు. ప్రమాదసమయంలో బస్సు డ్రైవర్ మద్యం సేవించలేదని నివేదికలో తేలిందని ఎస్పి తెలిపారు.

## ఫేక్ ప్రచారాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిన వైసీపీ

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ పార్టీ పూర్తిగా ఫేక్ ప్రచారాలకు ప్రతీకగా మారిపోయిందని.. అబద్ధాలను నిజాలుగా చూపించి, నిజాలను దాచిపెట్టడం వైసీపీకి నిత్యకృత్యంగా మారిందని గుంటూరు తూర్పు శాసనసభ్యుల నజీర్ అహ్మద్ మండిపడ్డారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...." కర్నూలు జిల్లా పెద్ద టేకూరు సమీపంలో జరిగిన దుర్ఘటనలో 19 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, సహాయక చర్యలు చేపట్టే విధంగా ఆదేశించారు. కానీ ఈ ఘటనను రాజకీయంగా వాడుకుంటూ, ఫేక్ ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం వైసీపీ చేస్తున్న తీరు అత్యంత దురదృష్టకరం. వాస్తవాలను పూర్తిగా విస్మరించి, సాక్షి వంటి వైసీపీ అనుబంధ మీడియా సంస్థలు "బెల్ట్ షాప్‌లో మద్యం తాగి ప్రమాదం" అనే అబద్ధపు కథనాలు ప్రచారం చేయడం బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.



**బెల్ట్ షాపులో కాదు ప్రభుత్వ లైసెన్స్‌డ్ షాపులోనే శివ శంకర్ మద్యం కొనుగోలు :** ప్రమాదానికి కారణమైన వ్యక్తి శివశంకర్ సాయంత్రం 7 గంటలకు మరియు 8:20 గంటలకు పెద్దటేకూరులోని లైసెన్స్ రేణుక ఎల్లమ్మ వైన్స్ షాప్‌లో మద్యం కొనుగోలు చేశాడు. ఈ విషయానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజ్ కూడా అందుబాటులో ఉంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన లైసెన్స్ షాప్‌ద్వారానే ఆ మద్యం అమ్ముడైనది. అది కల్తీ మద్యం కాదు. ఈ విషయాలు అన్ని నేను చెప్పడంలో ఎక్సైజ్ శాఖ అధికారులే తేల్చారు. అయినప్పటికీ, వైసీపీ నేతలు బెల్ట్ షాప్‌లు, కల్తీ మద్యం పేరుతో అబద్ధపు కథనాలు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు" అని మండిపడ్డారు.

**ఫేక్ ప్రచారాలు చేయడం వైసీపీకి అలవాటు:** "ప్రజల భావాలతో ఆడుకోవడం, విషాద ఘటనలను రాజకీయ లాభం కోసం వాడుకోవడం వైసీపీకి అలవాటుగా మారిపోయింది. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి ప్రమాదం నుండి వివేకానందరెడ్డి హత్య దాకా, అమరావతిపై చేసిన తప్పుడు ప్రచారం నుండి "పింక్ డైమండ్" కల్పిత కథల దాకాఅంతా అబద్ధ ప్రచారాలే వైసీపీ రాజకీయాల మూలం. ఈ ఘటనలో ప్రభుత్వం పారదర్శకంగా, వేగంగా స్పందించింది. బాధితులకు ఉత్తమ వైద్యం అందించడమే కాకుండా, పునరావాస చర్యలు కూడా ప్రారంభమయ్యాయి. అయినా కూడా వైసీపీ సైకో సోషల్ మీడియా బృందం అబద్ధాల ఆధారంగా ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న సురక్ష యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్ ట్రాక్ చేయగలుగుతున్న విధానం ఈ ప్రభుత్వం ప్రజల ప్రాణ భద్రత పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనం. కానీ గతంలో వైసీపీ పాలనలో కల్తీ మద్యం వల్ల 30,000 మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు ఈరోజు ఫేక్ ప్రచారం చేసే నాయకులు ఎక్కడ ఉన్నారు?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇటువంటి దుర్ఘటనలపై అబద్ధపు ప్రచారం చేయడం, రాజకీయ లాభం కోసం ప్రజల ప్రాణాలను వాడుకోవడం ఎప్పటికీ సమంజసం కాదని స్పష్టం చేశారు. అలాగే ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని, వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా నిజం ఎప్పుడూ వెలుగులోనే ఉంటుందని ఆయన అన్నారు.

## 'మొంథా' తుపాను ముప్పు నివారణ చర్యలు ముందస్తుగా చేపట్టాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రానికి 'మొంథా' తుపాను ముప్పు ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోమ్ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఆదివారం తాడేపల్లి లోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆమె సమావేశమై ముందస్తు ఏర్పాటు చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం తీవ్ర తుపానుగా మారి 27, 28 మరియు 29 వ తేదీ లలో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర గాలులతో కూడిన భారీ నుండి అతి భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి కష్టాలు కలుగకుండా తగు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విపత్తు నిర్వహణ చర్యలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. శాఖల వారిగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను ఆమె సమీక్షిస్తూ 24/7 వరద పర్యవేక్షణ సెల్‌ను నిర్వహించాలని, నదులు, కాలువలు గట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, బలహీన కట్టలను బలోపేతం చేసి గస్తీని ముమ్మరం చేయాలని జల వనరుల శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. పూర్తి సామర్థ్యంతో ఉన్న ట్యాంకులు, రిజర్వాయర్లను ప్రత్యేకంగా తనిఖీ చేసి, వరద హెచ్చరికలను వెంటనే జిల్లా కలెక్టర్లు తెలియజేయాలని సూచించారు.

బలహీనమైన రోడ్లు, వంతెనలు, కల్వర్టులను గుర్తించి మరమ్మతులు చేయాలని, అందుబాటులో ఉన్న జేసీబీలు , ట్రాక్టర్లు, క్లియరెన్స్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి చేసి, ప్రమాద ప్రాంతాల దగ్గర ముందుగానే ఉంచాలని రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.

అవసరమైనప్పుడు ప్రజల తరలింపు మరియు అవసరమైన వస్తువుల రవాణాకు ఆర్టీసీ బస్సులను సిద్ధంగా ఉంచాలని, అన్ని వాహనాలు మంచి స్థితిలో ఉండేలా చూడాలని, తగినంత ఇంధనం మరియు డ్రైవర్లు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

సురక్షిత తాగునీటి సరఫరా కు తగు చర్యలు తీసుకోవాలని, ఆయిల్ ఇంజిన్లు సిద్ధంగా ఉంచాలని, బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ మాత్రలు, సున్నం వంటి వస్తువులను తగినంత పరిమాణంలో




నిల్వ చేయాలని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి ట్యాంకర్లు, మొబైల్ శుద్ధి యూనిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరద నీటి పారుదల కాలులను శుభ్రపరచాలని, బ్లీచింగ్ పౌడర్, సున్నం వంటి పారిశుధ్య సామగ్రిని నిల్వ ఉంచుకోవాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. వరద ప్రమాదాలు, అత్యవసర సంప్రదింపులు, భద్రతా సూచనలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అన్ని సబ్‌స్టేషన్లలో డీజిల్ జనరేటర్ సెట్లను సిద్ధంగా ఉంచాలని, ముఖ్యమైన విడి భాగాలను నిల్వ చేయాలని, విద్యుత్ పునరుద్ధరణ బృందాలను అవసరమైన పరికరాలతో సిద్ధంగా ఉంచాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, టీకాలు, వైద్య పరికరాలను తగినంతగా నిల్వ ఉంచాలని, అంబులెన్స్‌లు, మొబైల్ మెడికల్ యూనిట్లు సిద్ధంగా ఉంచాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులకు ఆమె సూచించారు.

రైతులకు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల పట్ల మార్గదర్శకాలు ఇవ్వాలని, తట్టుకునే పంటలను ప్రోత్సహించాలని, విత్తనాలు, ఎరువులు, పశుగ్రాసం సరఫరా అయ్యేలా చూడాలని వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు.

తుఫాను హెచ్చరికలను వెంటనే మత్స్యకార గ్రామాలకు తెలియజేయాలని, చేపల వేటను నిలిపివేయాలని, లైఫ్ జాకెట్లు వంటి పరికరాలను సిద్ధంగా ఉంచాలని మత్స్య శాఖ అధికారులకు ఆమె సూచించారు.

మారుమూల ప్రాంతాల్లో ఆహార ధాన్యాలు, ఇంధన నిల్వలను ముందుగానే ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఆహార సరఫరా అంతరాయం లేకుండా చూడాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆమె ఆదేశించారు.

అగ్నిమాపక, APSDRF, NDRF బృందాలు తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, అవసరమైన రెస్క్యూ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు.

భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, కోస్ట్ గార్డ్ అధికారులు అవసరమైన హెలికాప్టర్లు, రక్షణ బృందాలు అందుబాటులో ఉంచి, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

అన్ని శాఖల జిల్లా యంత్రాంగం రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ తో సమన్వయంగా పనిచేసి, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వాయుగుండం గమనాన్ని, దాని తీవ్రతను, ప్రభావిత జిల్లాలు, ప్రాంతాల వివరాలను మంత్రికి, అధికారులకు వివరించారు.

స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## 'మొంథా'తో అప్రమత్తంగా ఉండండి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ ను దృష్టిలో పెట్టుకుని బీసీ హాస్టళ్ల వార్డెన్లు, ఎంజేపీ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటనున్న నేపథ్యంలో వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు 24 గంటలూ హాస్టళ్లలో ఉండాలని, విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేయాలని ఆదేశించారు. మారిన వాతావరణం నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలని స్పష్టంచేశారు. బయట ఆహారాలను హాస్టళ్లలోకి అనుమతించొద్దన్నారు. తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ కోతలు ఉండే అవకాశముందని, ఇన్వర్టర్లను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గిపెట్టెలను పెద్ద మొత్తంలో ముందు జాగ్రత్తగా సమకూర్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ల ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని స్పష్టంచేశారు. జిల్లా స్థాయిలో డీబీసీడబ్ల్యూవోలు, రాష్ట్ర స్థాయిలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లిఖార్జున, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలత హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సవిత ఆదేశించారు.

## మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది పటిష్ట సమన్వయంతో, ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.

ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ.. ఆర్డీవోలతో పాటు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పౌర సరఫరాలు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ.. అటువైపు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో ప్రయాణాలు చేయకుండా అవగాహన కల్పించాలని.. పశువులను చెట్ల కింద, స్తంభాలతో కట్టకుండా చూడాలని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య సంరక్షణ అవసరమైన రోగులు, గర్భిణీలను సమీప ఆసుపత్రుల్లో చేర్చాలని సూచించారు. అధికారులు, సిబ్బంది 24%శ%7 పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని.. ఏదైనా అత్యవర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454)కు నివేదించాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న భవంతులను గుర్తించి అందులో ఎవరూ ఉండకుండా.. పునరావాస శిబిరాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. చేపల వేటకు నదిలోకి మత్స్యకారులు వెళ్లకుండా ఆయా గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీచేయాలన్నారు. ఒకవేళ చెట్లు, స్తంభాలు ఎక్కడైనా పడిపోతే వెంటనే తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విధుల నిర్వహణలో నిబద్ధత, నిరంతర అప్రమత్తతే ప్రజల భద్రతకు భరోసానిస్తుందని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. టీసీలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.

తుపాను కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఫోన్ నెంబర్లు

కలెక్టర్ కార్యాలయం (91549 70454)

విజయవాడ ఆర్డీవో కార్యాలయం: 0866 2574454

నందిగామ ఆర్డీవో కార్యాలయం: (78930 53534)

తిరువూరు ఆర్డీవో కార్యాలయం: (83098 36215, 08673251235)

## వైసిపి నిరసన ర్యాలీ వాయిదా

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్)::** మొంథా తుపాను నేపథ్యంలో తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ విజ్ఞప్తి చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు, సహాయ, పునరావాస చర్యల్లో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 28వ తేదిన (మంగళవారం) అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ర్యాలీలను మొంథా తుపాను కారణంగా నవంబర్ 4 వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.



## నాగులచవితి సందర్భంగా నాగేంద్ర స్వామిని దర్శించుకున్న భక్తులు

ఆగిరిపల్లి, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)

ఈదులగూడెం గ్రామంలో కార్తీక మాసం మరియు నాగుల చవితి పర్వదినం సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. శ్రీ స్వయంభు నాగేంద్రుని సన్నిధిలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ పార్వతీ సమేత నాగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం నందు స్వామి వారి యొక్క ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం మరియు నాగేంద్రునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి సురేష్ ఆధ్వర్యంలో విశేషంగా జరుపబడినాయి. భక్తులు నాగేంద్ర స్వామివారి పుట్టలో పాలు పోసి ఆ యొక్క నాగేంద్రుని ఆశీస్సులు తీసుకుని తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాలలో అయ్యప్ప మాలదారులు శివ భక్తులు మరియు గ్రామస్తులు విశేషంగా పాల్గొనడం జరిగింది. అలాగే ఆగిరిపల్లి గ్రామంలో శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ అమ్మవారి దేవాలయంలో వేంచేసి ఉన్న నాగేంద్ర స్వామి వారి పుట్ట వద్ద భక్తులు పూజలు చేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

## ప్రయాణికులు భద్రతనే లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి. లక్ష్మణ్ రావు
- ఇబ్రహీంపట్నం బస్ స్టాప్ వద్ద లైటింగ్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)



ప్రయాణికుల భద్రతనే లక్ష్యంగా అని చర్యలు తీసుకుంటు న్నామని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి. లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ హైదరాబాద్ బస్టాప్ వద్ద సీఐ చంద్రశేఖర్ ఆదేశాలు మేరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నేషనల్ హైవే పైన అత్యధికంగా రద్దీగా ఉండే హైదరాబాద్ బస్ స్టాప్ ప్రాంతం సాయంత్రం 6 గంటల తర్వాత చీకటిగా ఉండటంతో మహిళలు, స్కూల్ మరియు కాలేజ్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సులు ఎక్కే వారి సంఖ్య భారీగా పెరగడంతో, చీకటిలో బస్సులు ఎక్కే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భావించి, ఈ సమస్యను గమనించిన సిఐ చంద్రశేఖర్ ఆదేశాలతో హనుమాన్ హార్డ్వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ కొండపల్లి వారి సహకారంతో లైట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బస్ స్టాప్ పరిసరాలు వెలుగుతో ఉంటే ప్రయాణికులు, మహిళలు, విద్యార్థులు భద్రంగా, సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. లైట్లు ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా ముగిసిన ఐదు రోజుల పైథాన్ విత్ ఎఐ సర్టిఫికెట్ కోర్సు




మైలవరం, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)

స్థానిక డా లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మరియు ఎక్సెల్ ఆర్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 5 డేస్ సర్టిఫికెట్ కోర్సు పైథాన్ విత్ ఎఐ ఈరోజు ఘనంగా ముగిసినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్. వీరయ్య ( హెచ్ ఓ డి ,సి ఎస్ ఈ) ఆఫ్ ఎల్బీఆర్ సీఇ, మైలవరం హాజరయి విద్యార్థులకు పైథాన్ యొక్క విశిష్టతను మరియు క్వాంటం కంప్యూటింగ్ యొక్క ప్రాముఖ్యతను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇల్లా రవి మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సు గురించి అనేక విషయములను తెలియచేయడం మరియు పైథాన్ లైబ్రరీ యొక్క ప్రాధాన్యత గురించి వివరించడం జరిగింది. ఈ సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్ గా వ్యవహరించిన కంప్యూటర్ సైన్స్ విభాగ అధినేత డా యన్ వెంకటాద్రి ఇలాంటి సర్టిఫికెట్ కోర్సులు పైథాన్ విత్ ఎఐ మీ అందరికి గొప్ప అవకాశాన్ని తెచ్చింది, ఈ ఐదు రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామ్ యొక్క మౌలిక అంశాలు లూపస్, ఫంక్షన్స్, డేటా స్ట్రక్చర్, ఆర్ఎస్ నేర్చుకోవడం జరిగింది దీనిలో ప్రతి ఒక్క అంశాన్ని ప్రాక్టికల్ గా విద్యార్థుల చే చేయించడం జరిగింది, ఈ కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపక అధ్యాపకతెర సిబ్బంది మరియు ఎక్సెల్ ఆర్ సంస్థ యొక్క ప్రతినిధులు దుర్గా ప్రసాద్ మరియు రిసోర్స్ పర్సన్ లక్ష్మణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కోలా దంపతులకు సన్మానం చేసిన కోలా అభిమానులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)

శ్రీకాళహస్తి వాయు లింగేశ్వర స్వామి ధర్మకర్తల మండలి సభ్యురాలుగా ప్రమాణం చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సతీమణి కోలా విశాలాక్షి దంపతులకు శ్రీకాళహస్తి పట్టణంలోని హెూటల్ నందు శ్రీకాళహస్తి బిజెపి యువ నాయకులు మరియు అభిమానులచే ఘన సన్మానం చేసి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, బిజెపి యువ నాయకులు, మహిళా మోర్చ సభ్యులు, కోలా ఆనంద్ అభిమానులు పాల్గొన్నారు.

### జగన్ పరిశ్రమలు తెచ్చారు..

# నసీర్ మాత్రం డ్రాయర్లు మాత్రమే అమ్మారు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్, రాష్ట్ర అధ్యక్షులు వి. ఖాదర్ భాషా

అమరావతి, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు వి. ఖాదర్ భాషా గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. నసీర్ అహ్మద్ జగన్ మోహన్ రెడ్డి పాలనపై చేసిన వ్యాఖ్యలు అసత్యాలు, అవగాహనలేని, చవకబారు మాటలు అని ఆయన పేర్కొన్నారు. జగన్ తెచ్చిన పరిశ్రమలు, కంపెనీలు, పెట్టుబడులు రాష్ట్రానికి వందల కొద్దీ కోట్ల ఆదాయం తెచ్చి, వేలాదిమందికి ఉపాధి కల్పించాయని ఆయన వివరించారు. “మరి నసీర్ చెప్పే ‘అసమర్థ పాలన’లో ఏది అసమర్థం?” అని ఆయన ప్రశ్నించారు. “సంక్షేమం అంటే ఒక్క భాగమే, కానీ అభివృద్ధి అంటే ఆంధ్రప్రదేశ్‌కు జీవనదానమిచ్చే శక్తి ం ఆ అభివృద్ధిని కొత్త ఎత్తుకు తీసుకెళ్లిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి” అని ఆయన పేర్కొన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఒక్క అడుగు కాదు, మైలురాళ్లను దాటిందని ఆయన అన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మెడికల్ కాలేజీలు, సచివాలయాలు, ఐటీ కంపెనీలు, సోలార్ ప్రాజెక్టులు, ఇథనాల్ ప్లాంట్లు, ఫ్లై ఓవర్లు, బైపాస్లు ం ప్రతి రంగంలోనూ జగన్ సంతకం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. “విజయవాడలో రహదారి పనులు, వైజాగ్‌లో ఐటీ కంపెనీలు, అనంతపురంలో సోలార్, జలయజ్ఞం కింద గండికోట, పేరూరు, చిత్రావతి, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా కోట్లాది మందికి నీరు అందించగలిగిన మొగోడు జగన్ మోహన్ రెడ్డి” అని ఆయన పేర్కొన్నారు. “200 కోట్లతో ఉద్దాణం ప్రాంతానికి శుద్ధజలాన్ని తీసుకురావడం ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శాశ్వత పరిష్కారం చూపిన నాయకుడు కూడా జగన్” అని ఆయన ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్‌పై గత ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని గుర్తుచేస్తూ, “ఏ రూపూ లేని పోలవరాన్ని దాదాపు పూర్తి స్థాయికి తీసుకువచ్చిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి. డైఫ్రాం వాల్ తప్ప మొత్తం ప్రాజెక్ట్ పూర్తయింది. ఇది చరిత్రలో నిలిచిపోయే సాధన” అని ఆయన అన్నారు. “ఇంత భారీ స్థాయిలో రోడ్లు, పోర్టులు, హార్బర్లు, కాలేజీలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు ఏ నాయకుడు చేయలేదు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ ముఖ్యమంత్రి తన పాలనను ప్రజల ముందుంచి తీర్పు అడగలేదు. కానీ జగన్ మాత్రం ఎమ్మెల్యేలను ఇంటింటికి పంపించి ప్రజల అభిప్రాయం అడిగిన మొగోడు” అని ఆయన పేర్కొన్నారు. జగన్ పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదురుస్తూ, యువతకు ఉద్యోగాలు తెచ్చిపెడుతుంటే,నసీర్ అహ్మద్ మాత్రం “డ్రాయర్ వ్యాఖ్యలతో” రాజకీయాలను చవకబారు స్థాయికి తీసుకెళ్తున్నారని ఆయన విమర్శించారు. “అభివృద్ధి అంటే మీ లాగా చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకుని ముచ్చట్లు పెట్టడం కాదు. మా జగనన్న లా అభివృద్ధి చేయండి ం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం. అది మా జగనన్నతోనే సాధ్యమైంది” అని వి. ఖాదర్ భాషా పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ

గన్నవరం, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నెక్కలపు శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే యార్లగడ్డ గన్నవరం గౌడ పేటలోని శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ సుమారు 8 సంవత్సరాల క్రితం తాను నియోజవర్గానికి వచ్చినప్పటినుండి శ్రీనివాస్ తో పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. ప్రజాశక్తిలో పనిచేస్తున్నప్పటికీ ఏ పార్టీకి కొమ్ము కాయకుండా వార్తలు రాసేవారని తెలిపారు. మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గౌడ పేటలోని స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎమ్. సురేంద్ర సోదరి ఈశ్వర విజయలక్ష్మి ఇటీవల మరణించగా సాయంత్రం శ్రీనగర్ లోని విజయలక్ష్మి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. గన్నవరం నియోజకవర్గ టిడిపి క్లస్టర్ కన్వీనర్ షేక్ కరీముల్లా సోదరి షేక్ మస్తాన్ బీ ఇటీవల మరణించగా,మస్తాన్ బీ కుటుంబ సభ్యులను యార్లగడ్డ పరామర్శించారు. తదుపరి గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ ఇటీవల మరణించిన కోనేరు కృష్ణారావు చిత్రపటానికి యార్లగడ్డ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, ఎంపీటీసీ పటమట రంగారావు, వైస్ ఎంపిపి కొమ్మరాజు సుధీర్, టీడీపీ నాయకులు గొంది నరేంద్ర, ఎంపీటీసీ మద్దినేని వెంకటేశ్వరావు, నాగార్జున, రంగబాబు, కొమ్మరాజు సుధీర్, పాలడుగు నాని, మన్నెం శ్రీనివాసరావు, ధర్మారావు, కారంపూడి సాంబయ్య, బస్సే నాగప్రసాద్, కొసరాజు రాము, తదితర టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30న మెగా జాబ్ మేళా

గుంటూరు, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 30న గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ మేళాలో 30కిపైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 935 ఉద్యోగాలు లభ్యమవుతాయని చెప్పారు. 10వ తరగతి నుంచి బి.టెక్ వరకు అర్హత ఉన్న 18%-%25 ఏళ్ల యువతీ యువకులు బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్, ఫోటోతో హాజరవచ్చని నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. వివరాలకు 9988853335 వంటి నంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.



# మంతా తుపాన్‌ను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధం

- బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

బాపట్ల, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్)



మంతా తుపాన్ ను సమర్థంగా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ లో మీడియా సమావేశం నిర్వహించారు. తీవ్ర తుపాన్ తీరానికి 900 కిలోమీటర్ల దూరం సముద్రంలో కేంద్రీకృతమైందని కలెక్టర్ చెప్పారు. దీని ప్రభావంతో ఈనెల 27 నుంచి 29 తేదీ వరకు బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం ఇచ్చిందన్నారు. ఈనెల 28వ తేదీన రాత్రి 9 నుంచి 11 గంటల మధ్యలో ఏపీలోనే తీరం దాటే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సి ఎస్, డిజిపి లు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లతో అత్యవసర సమావేశం నిర్వహించారన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తుగా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వివరించారు. దీంతో జిల్లా యంత్రాంగాన్ని తక్షణమే అప్రమత్తం చేశామన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారుల నుంచి గ్రామస్థాయి అధికారులతోనూ నేరుగా వీక్షణ సమావేశం నిర్వహించామన్నారు. సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని ఆదేశించామన్నారు. తుపాను ముప్పు ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు భయపడవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల కొరకు కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు పనిచేస్తుందని, ప్రజలకు ఇబ్బందులు కలిగితే తక్షణమే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయం, మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ అధికారులంతా ప్రజలకు అందుబాటులోనే ఉంటారని చెప్పారు. సోమవారం ఉదయం నుంచి తుపానుతో ప్రభావం, వర్షం తీవ్రత కనిపిస్తుందన్నారు. తుపాను ప్రభావంతో 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. దీంతో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంసిద్ధంగా ఉన్నామని, ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్తీక మాసంలో పవిత్ర స్నానాలకు వెళ్లేవారు అనుకూలమైన వాతావరణం సమయం చూసుకోవాలన్నారు. రానున్న ఐదు రోజులు బాపట్ల జిల్లా తీవ్ర తుపాను ప్రభావాన్ని ఎదుర్కోనుందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి సచివాలయాల వరకు అన్ని స్థాయిల్లో సహాయక చర్యల కొరకు టీములను నియమించామన్నారు. రానున్న తీవ్రతను నివారించడానికి సంసిద్ధతలో ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు బాపట్ల జిల్లా కేంద్రంలో ఉంచుతామన్నారు. నాలుగు క్విక్ రెస్పాన్స్ టీములు అందుబాటులో ఉంటాయన్నారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులలో వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తుపాను ప్రభావంతో దెబ్బతినే రహదారులను గుర్తించి రెవెన్యూ, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా ప్రయోజనం నిమిత్తం అవసరమైతే యుద్ధ ప్రాతిపదికన ట్రాఫిక్ డైవర్షన్ కు చర్యలు తీసుకుంటామన్నారు. పనరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తే ఆ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 28వ తేదీ వరకు సముద్రంలోకి ఎవరిని అనుమతించేది లేదని చెప్పారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్!

## ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఇంటర్ విద్యాశాఖ

## ప్రతి విద్యార్థికి రెండు జతలు ఇవ్వాలని ప్రతిపాదన

## సర్కార్ ఆమోదిస్తే వచ్చే యేడాది నుంచి అమలయ్యే అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్‌తో కనిపించనున్నారు. అదేంటీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ప్రభుత్వం నిర్ణయించలేదు కదా.. అటువంటప్పుడు వారు యూనిఫామ్స్‌తో ఎలా కనిపిస్తారని అనుకుంటున్నారా? రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా యూనిఫామ్స్‌ను అమలు చేయాలని ఇంటర్ విద్యా శాఖ యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లోనూ ఒకేరకమైన డ్రెస్‌కోడ్‌తో యూనిఫామ్స్‌ను సిద్ధం చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇంటర్ విద్య శాఖ ప్రభుత్వానికి పంపించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రతి యేడాది రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యను అందిస్తున్న ఇంటర్ విద్య శాఖ.. ఇకపై తమ విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్‌ను అందించాలని.. అలా చేస్తే ప్రస్తుతం చేరుతున్న వారికంటే ఎక్కువ మంది విద్యార్థులు గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే యూనిఫామ్స్ అందజేస్తే విద్యార్థులు హాజరుశాతం కూడా పెరుగుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. కాలేజీకని చెప్పి ఇంట్లో నుంచి వస్తున్న మగ విద్యార్థుల్లో కొందరు కాలేజీ రాకుండా చిల్లరగా తిరుగుతున్నారని.. యూనిఫామ్స్‌ను కనుక విద్యార్థులకు పంపిణీ చేసినట్టయితే వారు యూనిఫామ్‌తో బయటకనపడితే ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులని తెలుస్తుందని.. దీంతో భయపడి తప్పకుండా కాలేజీకి వస్తారనే అంచనాలో అధికారులున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా యూనిఫామ్‌ను ఇస్తే విద్యార్థులు తమకు కూడా డ్రెస్ కోడ్ ఉందని, యూనిఫామ్ ధరించి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు చెందిన విద్యార్థుల మాదిరిగా భావించి కాలేజీకి రెగ్యులర్‌గా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వాటిల్లో సుమారు 1,41,000 విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలు పంపించినట్టు తెలుస్తోంది. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్‌ను అందజేస్తే ఏడాదికి ఎంత మేరకు ఖర్చు అవుతుందనే విషయాన్ని కూడా లెక్కలు వేసి ప్రభుత్వానికి సమర్పించినట్టు సమాచారం. ప్రభుత్వం ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలను ఆమోదిస్తే.. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించి వచ్చే ఏడాది నుంచి లేదంటే 2027-28 నుంచి అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాల నిర్మాణం

## రూ. 117.30 కోట్లు ఖర్చు.. పిఎంజెవికె పథకంలో నిర్మాణం చేపట్టనున్న ఇంటర్ విద్యాశాఖ

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మించనున్నారు. ఇందుకోసం రూ. 117.30 కోట్లు ఖర్చు కానుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయనున్నాయి. మైనారిటీలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లో కొనసాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నూతన భవనాలను నిర్మించనున్నారు. ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్(పిఎంజివికె) పథకంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నూతన భవనాలను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 60 శాతం కేంద్రం నిధులను ఇవ్వనుండగా.. మరో 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 46.92 కోట్లను ఖర్చు చేయనుండగా.. కేంద్రం రూ. 70.38 కోట్లను సాయంగా అందించనుంది. 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 4 కాలేజీలు హైదరాబాద్ జిల్లాలో ఉండగా ఒకటి నల్గొండ, ఒకటి ఆదిలాబాద్, రెండు నిర్మల్, ఒకటి మహబూబ్‌నగర్, ఒకటి నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నాయి.

# వెనుకబడిన సుగంధ ద్రవ్యాల సాగు

## చింతపండుకు సైతం దిగుమతే గతి

## ఉద్యాన శాఖలో ప్రణాళికా లోపం

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** సుగంధ ద్రవ్యాల సాగులో తెలంగాణ వెనుకబడపోయింది. ఉద్యాన శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో ప్రధానంగా చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. ఎండు మిర్చి, పసుపు సాగులో మాత్రం రాష్ట్రం అగ్రగామిగా ఉన్నా, చివరకు చింత పండును సైతం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రతి రోజు సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు ఉద్యాన అధికారుల అంచనా. ఇలా రోజుకు 731 టన్నులు డిమాండ్ ఉండగా, ఏటా 2.63 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా. చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరం ఉన్నది. ఈ డిమాండ్‌కు సరిపడా పంట రావాలంటే రాష్ట్రంలో 1.09 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగుచే యాల్సి ఉంటుందని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కానీ చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాల వంటివాటిని కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఈ విధంగా ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో అల్లం 2,103 ఎకరాల్లో సాగవుతూ తద్వారా 20,489 టన్నుల ఉత్పత్తి అవుతోంది. అయితే అల్లం వినియోగం మాత్రం 68,419 టన్నులుగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో సాగైనది పోను ఇంకా 47,930 టన్నుల మేర ఇతర రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇక వెల్లుల్లి విషయానికి వస్తే 27 ఎకరాల్లో మాత్రమే సాగవుతూ, 148 టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది. ధనియాలు రాష్ట్రం వ్యాప్తంగా 13,532 టన్నుల వినియోగం ఉండగా, 4,971 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. తద్వారా 2,431 టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపధ్యంలో రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేయాల్సిన అవసరం ఉందని అంచనా. ఇందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహం కల్పించి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వేసవి విద్యుత్ కోసం ముందస్తు చర్యలు

## విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి మిట్టల్

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వచ్చే వేసవిలో గరిష్ట డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించే అవకాశం ఉన్న దృష్ట్యా దాన్ని అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది గరిష్ట డిమాండ్ 17162 మెగావాట్లకు చేరినా దాన్ని అధిగమించి విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఓవర్ లోడింగ్ సమస్యలు తలెత్తకుండా చేశారన్నారు. ఇదే విధంగా వేసవి ప్రారంభానికి ముందే లైన్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్ ఫార్మర్లల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులన్నీ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది భారీ డిమాండ్ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో 103 నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాన్స్‌కో పరిధిలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జెన్కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఓవర్ హాలింగ్ దాదాపు అన్ని యూనిట్లలో పూర్తయ్యిందని చెప్పారు.



బిటిపిఎస్, కెటిపిఎస్ ఓవర్ హాలింగ్ త్వరలో పూర్తి చేయనున్నారని వెల్లడించారు. మరి కొద్ది నెలల్లో యాదాద్రి థర్మల్ లోని అన్ని యూనిట్లు అందుబాటులోకి రావడంతో మొత్తం 4000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కాగా థర్మల్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన, పారదర్శక సేవలు అందించేందుకు ట్రాన్స ఫార్మర్ల, ఫీడర్లలో ఆటోమేషన్ విధానం తేవాలని చెప్పారు. ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ లకు ఇస్తున్న రాయితీలను ప్రభుత్వ సంస్థలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసేలా అవగాహనా కల్పించాలన్నారు. హైదరాబాద్‌ను ఇవి హబ్‌గా మార్చడంలో విద్యుత్, రెడ్కో సంస్థలు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్కో, జెన్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, సింగరేణి సిఎండిలు కృష్ణ భాస్కర్, హరీష్, బలరాం, ఫరూఖీ, వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అచ్యుతా ఆగ్రోస్‌లో రూ.3.82 కోట్ల ధాన్యం మాయం

## 17 వాహనాలపై మోటారువాహనాల చట్టం ప్రయోగం

## మైనింగ్ అక్రమాలపై 8 కేసులు నమోదు.. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం తెల్లవారుజాము వరకు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వరంగల్ యూనిట్ అధికారులు ములుగు జిల్లాలోని మల్లంపల్లిలో ఉన్న శ్రీఅచ్యుత ఆగ్రో ఇండస్ట్రీస్ అనే రైస్‌మిల్లులో తనిఖీలు మొదలు పెట్టారు. ఆ రైస్‌మిల్లులో స్టాక్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన 4780.80 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 రబీ వేలం ధాన్యం 11191.26 క్వింటాళ్లు, మొత్తం 15972.06 క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులో లేదని వారు గుర్తించారు. నల్లబజారు పట్టించిన ధాన్యం విలువ రూ.మూడు కోట్ల 81లక్షల57వేల ,251 ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. శ్రీ అచ్యుతా ఆగ్రోస్ రైస్ మిల్లరుపై ఇసి చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవ దానికి ములుగు జిల్లా పౌర సరఫరాల అధికారికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సూచిం చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్ రూరల్ యూనిట్ శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జామున వరకు ఆకస్మిక రూట్ తనిఖీలు విస్తృతంగా చేశారు. మైనింగ్ శాఖ, రవాణా శాఖ విభాగాల అధికారులతో కలిసి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో మోటారు వాహనాల చట్టం కింద 17 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే గనులు మరియు ఖనిజాల చట్టం కింద 8 కేసులు నమోదు చేశారు. వసూలు చేసిన మొత్తం పన్ను సుమారు రూ.6,27,349 జరిమానా వసూలు చేశారు.



# ఎంజిఎం ఘటనలపై ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా సీరియస్

## సూపరింటెండెంట్‌పై వేటుకి ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్‌లో ఉన్న ఎంజీఎం ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న వరస సంఘటనలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యం వ్యవహరించినహాస్పిటల్ సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెం డెంట్‌తోపాటు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశం చారు. ఎంజిఎం హాస్పిటల్‌ను గాడిన పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి మంత్రి సూచించారు. ప్రతివారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించారు. అలాగే ఎంజీఎంలో గత కొన్నేళ్లుగా పాతుకు పోయిన ఉద్యోగుల వివరాలు సేకరించి, వారి పనితీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ఎసిబి వలలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్



**నస్పూర్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ భిక్కు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఆయన అద్దె ఇంటిపై ఏసీబీ అధికారుల బృందం దాడి నిర్వహించింది. రాథోడ్ భిక్కు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహరిం చేందుకు రాథోడ్ ముందుగా 7 లక్షల రూపాయలు లంచంగా డిమాండ్ చేశాడు. పలుమార్లు అభ్యర్థించడంతో మొత్తం 5 లక్షల రూపాయలకు ఒప్పుకున్నాడు. తొలి విడతగా 2 లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికా రులు పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ జి. మధు తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఓ ఉద్యోగి సస్పెండ్ అయ్యాడు. అతడిని సస్పెన్షన్ నుంచి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీవో 44 ప్రకారం వేతన సవరణల చేయడం, 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడం, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన భత్యాలు మంజూరు చేయడం, విచారణ నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దాడి అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షలో రాథోడ్ కుడిచేయి వేళ్లు, లంచం డబ్బు తాకిన బనియన్ భాగం పాజిటివ్‌గా తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. రాథోడ్ భిక్కును అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్, 9440446106 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చు. ఎవరైనా లంచం అడిగితే తన సెల్ నంబర్ 9154388963లో సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివ రాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ జి. మధు తెలిపారు.

# ఇంటర్ పరీక్షల్లో ఇంటర్నల్ మార్కుల నిర్ణయం ఆత్మహత్యాసదృశం

## జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే యేడాది నుంచి ఇంటర్మీడియట్ విద్యా మండలి.. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థకు, ఇంటర్ విద్యార్థులకు ఆత్మహత్యా సదృశ్యమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ 1969-70 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించబడి నప్పటి నుండి దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో కొనసాగుతుందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగినది ఇంటర్ విద్యా మండలి.. దేశ వ్యాప్తంగా సిబిఎస్ఈ పుస్తకాలతో పోటీ పడే విధంగా గణిత శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం దేశం లోనే అత్యున్నత విద్యా ప్రమాణాలు సొంతం చేసుకుందన్నారు. కొఠారీ కమిషన్ సిఫారసులకి అనుగుణంగానే 10+2+3 విధానాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించిన ఘనత దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి దక్కుతుందన్నారు. దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో నిర్వహించేటువంటి ఐఐటి, ఎన్ఐటి కళాశాలల పరీక్షలు, ఎంఎస్ఈటీ పరీక్షలకు కూడా స్వీయ తర్ఫీదును పొంది సీట్లు సాధించేలా చేసిన ఘనత ఇంటర్మీడియట్ విద్యా మండలికి ఉందన్నారు. ఇప్పుడు ఎలాంటి చర్చ లేకుండా.. ఇటు విద్యార్థుల అభిప్రాయాలుగానీ, అధ్యాపకుల అభిప్రాయాలుగానీ, యాజమాన్యం అభిప్రా యాలు గానీ.. ఆఖరికి తల్లిదండ్రుల అభిప్రాయా లు పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఫలితాల పెంపు అనే దురాలోచనతో ఇంటర్మీడియట్ విద్యా మండలి 20 మార్కులు ఇంటర్నల్‌కి, 80 మార్కులు ఎక్స టర్నల్ కి అనేటువంటి విధంగా పరీక్షా విధానాన్ని పుస్తకాల తయారీని చేపట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్నటువంటి పరిస్థితులు, ప్రమాణాలు వాటిని ఆసరాగా చేసుకుని ఈ నిర్ణయం తీసుకోవడంతో ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక పెద్ద తప్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఇంట ర్నల్ మార్కుల సిస్టం ఉన్నమాట వాస్తవమని.. కానీ ఆయా రాష్ట్రాలు జాతీయ స్థాయిలో సాధిస్తున్నటువంటి ప్రవేశ పరీక్షల ఉత్తీర్ణతలు మనకంటే చాలా తక్కువగా ఉన్నాయన్న విషయాన్ని ఇంటర్మీడియట్ విద్యా మండలి విస్మరించడం సిగ్గుచేటన్నారు. గత 30 సంవత్సరాలుగా సగటున ఫస్ట్ ఇయర్‌లో 50శాతం, సెకండ్ ఇయర్‌లో 65 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భాన్ని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్య కార్పొరేటీకరణ జరిగిన నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం కారణంగా ప్రాక్టికల్ పరీక్షలే ఒక ప్రహసనంగా మారిన సందర్భంలో .. ఇపుడు 20 శాతం ఇంటర్నల్ మార్కులు విద్యార్థులకు కల్పించడం అంటే.. ఇంటర్మీడియట్ విద్యా పరీక్షల నిర్వహణను ఆయా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడమేనని మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు.



బిసి ప్రతినిధులతో మాట్లాడుతున్న బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

# జనాభా ప్రకారం రిజర్వేషన్లకు సవరణ జరగాలి

## పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో ముందుకు రావాలి

## బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వే షన్లతోపాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ జరగాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కుండా ప్రవీణ్ గౌడ్, బాణాల అజయ్ తదితర నేతలు కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రిజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతిరేక తీర్పులు వస్తున్నాయి. దీనికి రాజ్యాంగ బద్ధత కల్పించడమే శాశ్వత పరిష్కారమన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి' అన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారని గుర్తుచేశారు. కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి మోడీ అంగీకరించడం ధైర్య సహసాలలో కూడుకున్న అంశం. కులగణన వివరాలు వచ్చిన తర్వాత అన్ని రంగాలలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా ఇవ్వడానికి సిద్ధపడే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

'బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వే షన్లు కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు 'బిసి యాక్టు'ను పార్ల మెంట్‌లో తీసుకరావాలి.స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాలని ఆయన బిసి వర్గాలకు పిలుపునిచ్చారు.

# కుట్ర చేసి నన్ను బిఆర్‌ఎస్ నుంచి బయటకు పంపారు

## నా దారి నేను వెతుక్కుంటున్నా : కవిత

## అమరవీరుల కుటుంబాలకు ఇంకా న్యాయం జరగలేదని వ్యాఖ్య

**జర్నలిస్ట్‌ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 26 :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. బీఆర్‌ఎస్ పార్టీకి దూరమైన తర్వాత ప్రజల్లోకి వచ్చిన ఆమె నిజామాబాద్ కేంద్రంగా జాగృతి జనం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని, ఇప్పుడు తన దారి తాను వెతుక్కుంటున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు.శనివారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'గత 20 ఏళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో,బీఆర్‌ఎస్ పార్టీ కోసం అంకితభావం తో పనిచేశాను. 27 ఏళ్ల వయసులోనే తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టాను. ఎన్నో అవమానాలు ఎదురైనా ఓపికతో భరించాను', అని గుర్తు చేసుకున్నారు. నిజామాబాద్‌లో తన ఓటమి వెనుక పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించిన కవిత, 'ఏం జరిగిందో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. జరిగిన కుట్ర గురించి పిల్లల్ని అడిగినా చెబుతారు' అని వ్యాఖ్యానించారు. ఇకపై తన ప్రయాణం ప్రజలతోనే అని స్పష్టం చేసిన కవిత, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచినా అమరవీరుల కుటుంబాలకు సరైన గౌరవం, న్యాయం దక్కలేదు. వారి కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఈ జనం బాటలో భాగంగా మేధావులు, విద్యార్థులు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడతాను. అందరి భాగస్వామ్యంతో ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి సాధించడమే నా లక్ష్యం అని తెలిపారు. యాత్ర ప్రారంభానికి ముందుగా ఉదయం నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 'కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నాను' అని ఆమె అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..సామాజిక



తెలంగాణ సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని.. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు చేశారు. 'తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం' అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు.

# బిసి బిడ్డ పిఎం మోడీ బిసి రిజర్వేషన్‌కు అనుకూలంగా రావాలి

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, అక్టోబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వెనుకబడిన తరగతుల బిడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా బిసిలకు 42శాతం రిజర్వేషన్‌కు అనుకూ లంగా వ్యవహరిస్తే అన్ని రకాలుగా లబ్ది జరుగుతుంది మాజీ ఎంపి మాజీ పిసిసి అధ్యక్షుడు వి. హనుమంతరావు ఆశా భావం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ బిసి లకు రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలో కి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాలుగా బిసి రిజర్వేషన్ల గురించి చిత్తశుద్ధితో పనులు చేశారు.ఇప్పుడు బిసి రిజర్వే షన్ల కేసు కోర్టులో పెండింగ్ ఉంది.పార్లమెంట్ లో తెలంగాణ బిసి బిల్లు పెట్టి 9వ షెడ్యూల్ లో పెట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా రాజకీయ పక్షాల సమావేశం పెట్టి ఈ విషయం మాట్లాడాలని కాంగ్రెస్ ఒబిసిల కన్వీనర్ గా కోరారు . కేంద్రంలో ఐఐటీ, ఐఐఎం విషయం లో నేను గతంలో సోనియాగాంధీ కోరుతే అప్పుడు అమలు అయ్యిందని అన్నారు.బిజెపి నాయ కులు, ఎంపిలు ప్రధానమంత్రి ని కోరి బిసి రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలి ఇదే మంచి సమయం ఇప్పుడు కాకపోతే ఎప్పుడు కాదని ఆయన చెప్పారు.అగ్రవర్ణ నాయకులు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, బిసి రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బిసి రిజర్వేషన్ల విషయంలో సహకరించి అమలు అయ్యేలా చూడాలని నేను ఒబిసి కన్వీనర్‌గా అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నా అని ఆయన అన్నారు.

# భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్యదేశం

## నోబెల్ గ్రహీత మరియా కొరినా మచాడో ప్రశంసలు



**కారకాస్, అక్టోబరు 26 :** నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడో భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ ఒక 'గొప్ప ప్రజాస్వామ్యం' అని, ప్రపంచంలోని అనేక దేశాలకు 'ఒక ఉదాహరణ' అని కొనియాడారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడిన తర్వాత భారత్‌తో అన్ని రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, భారత్ తమకు గొప్ప మిత్రదేశం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలని ఆశిస్తున్నానని, స్వేచ్ఛాయుత వెనిజులాలో ఆయనకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నానని తెలిపారు. గత 15 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె మీడియా ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎన్నో దేశాలకు, తరాలకు ఆదర్శంగా నిలిచింది. ఇది చాలా గొప్ప విషయం. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు, దానిని నిరంతరం బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని ఎన్నో దేశాలు మీ వైపు చూస్తున్నాయని ఆమె అన్నారు. తాను భారత్‌ను మనస్ఫూర్తిగా ఆరాధిస్తానని, తన కుమార్తె కొన్ని నెలల క్రితమే భారత్‌ను సందర్శించిందని, అక్కడి సంస్కృతిని ఎంతో ఇష్టపడిందని ఆమె చెప్పారు. మహాత్ముడి అహింసాయుత పోరాటం తనకు స్ఫూర్తినిచ్చిందని, శాంతియుతంగా ఉండటం బలహీనత కాదని గాంధీ ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం గురించి మాట్లాడుతూ, 2024 జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, నికోలస్ మదురో ప్రభుత్వం ఫలితాలను తారుమారు చేసిందని ఆమె ఆరోపించారు. విపక్షాల అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నేను 93 శాతం ఓట్లతో గెలిచాను. కానీ, నియంతృత్వ ప్రభుత్వం నన్ను పోటీ చేయనీయకుండా నిషేధం విధించింది. దాంతో, ఓ దౌత్యవేత్త మా తరఫున నిలబడ్డారు. మేము 70 శాతం ఓట్లతో గెలిచాం. దీనికి సంబంధించిన 85 శాతం ఓటింగ్ పత్రాలను డిజిటలైజ్ చేసి ఆధారాలుగా సేకరించాం. మేం గెలిచిన తర్వాత చర్చల ద్వారా అధికార మార్పిడికి మదురోకు అవకాశం ఇచ్చినా ఆయన నిరాకరించారు. ఆ తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన అణచివేతకు పాల్పడ్డారు. వేలాది మంది అమాయకులు అదృశ్యమయ్యారు. మహిళలు, చిన్నారులపై చిత్రహింసలకు పాల్పడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెనిజులాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమకు ప్రధాన మిత్రుడని మచాడో అభివర్ణించారు. అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో ఏర్పడుతున్న అంతర్జాతీయ కూటమితో మదురో పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు. వెనిజులాలో నేరపూరిత సోషలిస్టు పాలన అంతమైన తర్వాత ఇంధనం, మౌలిక వసతులు, టెలికం వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత కంపెనీలకు గొప్ప అవకాశాలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.



# విశ్వాసం కోల్పోతున్న యుఎన్

## విదేశాంగమంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 26 :** ఐక్యరాజ్యసమితి పని తీరును విదేశాంగ మంత్రి జైశంకం తప్పుపట్టారు. యునైటెడ్ నేషన్స్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఆయన ఆ సంస్థ గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రాతినిధ్యం మరిచిపోయిందన్నారు. ఉగ్రవాదం, ప్రపంచ ప్రగతిపై నిర్ణయాలు తీసుకోవడం విఫలమైన ఆ సంస్థ తన విశ్వాసాన్ని కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో బలమైన దేశంగా భారత్ ఉందన్నారు. కానీ ఆ ప్రపచ సంస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందన్నారు. చట్టబద్ధమైన, ప్రభావంతమైన పనితీరును వ్యవహరించడం లేదని విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో అంతా సవ్యంగా లేదన్న విషయాన్ని గ్రహించాలని జైశంకర్ తెలిపారు. ఆ సంస్థ తీసుకుంటున్న నిర్ణయాలు.. సభ్య దేశాలకు నిదర్శనంగా లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యలను కూడా ఆ సంస్థ పరిష్కరించడం లేదన్నారు. యూఎన్‌లో జరుగుతున్న చర్చలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయని, ఆ సంస్థ పని విధానం గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలను నిలిపివేశారని, దానికి తోడు ఇప్పుడు ఆర్థిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. యూఎన్ భద్రతా మండలిలో మార్పులు చేయాలని, భారత్‌తోపాటు జపాన్, జర్మనీ, బ్రెజిల్ దేశాలకు పర్మనెంట్ సభ్యత్వాన్ని ఇవ్వాలని జైశంకర్ గుర్తుచేశారు. ఉగ్రవాదసంస్థలపైనా కానీ, ఆ దేశాలకు అండగా ఉన్న దేశాలపై చర్యలు తీసుకోవడంలో యూఎన్ విఫలమైందన్నారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించకుండా చైనా అడ్డుకుంటోందని ఆరోపించారు.

# బురఖా వేసుకుని మాముందునుంచే తప్పించుకున్నాడు

## బిన్‌లాడెన్‌పై అమెరికా సిఐఎ అధికారి సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, అక్టోబరు 26 :** అమెరికాను వణికించిన అల్ ఖైదా చీఫ్ బిన్ లాడెన్ గురించి సీఐఏ మాజీ అధికారి జాన్ కిరియాకో ఒక సంచలన సంఘటన తెలిపారు. 2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా టెర్రరిస్టులు విమానాలను హైజాక్ చేసి అమెరికాలోని ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి తర్వాత అమెరికా బలగాలు అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ కోసం వేట మొదలు పెట్టాయి. అమెరికా బలగాలను ముఖ్యంగా సీఐఏను ముప్పుతిప్పలు పెట్టిన లాడెన్ చివరకు 2011 మే 2న పాకిస్థాన్ లోని అబోట్టాబాద్ లో హతమయ్యాడు. ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన పదేళ్ల తర్వాత లాడెన్ ను అమెరికా బలగాలు తుదముట్టించాయి. అయితే,లాడెన్ అంతకుముందే తమకు పట్టుబడేవాడని, త్రుటిలో తప్పించుకున్నాడని జాన్ కిరియాకో చెప్పారు. 2001 సెప్టెంబర్ 11న ట్విన్ టవర్స్ కూల్చివేత తర్వాతి నెలలో అంటే అక్టోబర్ లోనే ఆఫ్ఘనిస్థాన్ లోని టోరాబోరా కొండల్లో అల్ ఖైదా స్థావరాన్ని సీఐఏ బలగాలు చుట్టుముట్టాయని వివరించారు. ఆ సమయంలో బిన్ లాడెన్ కూడా అక్కడే ఉన్నాడని చెప్పారు. లాడెన్ కదలికలపై పక్కాగా నిఘా పెట్టి టోరాబోరా కొండల్లో అతడిని పట్టుకోవడమో లేక హతమార్చడమో చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లామని వివరించారు.

అల్‌ఖైదా కూడా తమకు కౌంటర్‌గా కుయుక్తులు పన్నిందని, అందులో మొదటగా తమ సానుభూతిపరుడిని మా వద్దకు పంపించిందని జాన్ కిరియాకో చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ లో లాడెన్ కోసం వేటాడుతున్న క్రమంలో తమకు స్థానిక భాషలు తెలిసిన అనువాదకుడి అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకోసం తాము నియమించుకున్న స్థానికుడు అల్ ఖైదా సానుభూతిపరుడేనని తర్వాత తెలిసిందన్నారు. టోరాబోరా కొండలను చుట్టుముట్టిన తర్వాత టెర్రరిస్టుల నుంచి తమకు ఓ ప్రతిపాదన వచ్చిందన్నారు. తమ వద్దనున్న మహిళలు, పిల్లలను క్షేమంగా బయటకు పంపించాక తాము లొంగిపోతామని టెర్రరిస్టులు చెప్పారని, ఇందుకోసం సాయంత్రం దాకా వేచి ఉండాలని ప్రతిపాదించారని వివరించారు. తమకు అనువాదకుడిగా పనిచేసిన వ్యక్తి ఈ ప్రతిపాదనకు అధికారులను ఒప్పించాడన్నారు. తీరా సాయంత్రం మసక చీకట్లలో మహిళలతోపాటు బిన్ లాడెన్ కూడా ఓ బురఖా ధరించి తమ పక్క నుంచే వెళ్లిపోయాడని జాన్ కిరియాకో వివరించారు. నాడు అల్ ఖైదా టెర్రరిస్టుల ప్రతిపాదనకు ఒప్పుకోకుంటే లాడెన్ ను 2001లోనే తుదముట్టించే వాళ్లమని కిరియాకో తెలిపారు.



## ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు

# అమెరికాలో మరో కొత్త రూల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 26 :** వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారుల తో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేందుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబం ధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021 లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు. కాగా మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ జాతీయవాదాన్ని బలంగా వినిపిస్తోన్న ట్రంప్ హెచ్ 1 బీ వీసాలకు సంబంధించి నిబంధనలు విధించారు. వాటి వార్షిక రుసుమును ఒకేసారి లక్ష డాలర్లకు పెంచేసి సంచలనం సృష్టించారు. అనంతరం పలు సవరణలు చేశారు. ఈ వీసా వ్యవస్థనుసరిదిద్దడానికి, అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడానికి అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లక్ష డాలర్ల ఫీజు నిర్ణయంతీసుకున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# లాలూ, రబ్రీ సర్కారు వస్తే మళ్లీ ఆటవిక పాలనే

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్వజం




**పాట్నా, అక్టోబరు 26 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ బిజెపి నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన మాటల జోరు పెంచారు. శనివారం ఖగారియాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా.. ప్రతిపక్ష కూటమిపై దుమ్మెత్తిపోశారు. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌కు ఓటేస్తే ఆటవిక పాలనను కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను హెచ్చరించారు. ఎన్డీయె సర్కారు బిజెపిని అభివృద్ధిపథంలో నడిపించిందని అమిత్‌షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివృద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలని అన్నారు. లాలూ, రబ్రీదేవీల సర్కారు వచ్చిందంటే.. దాంతోపాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని వ్యాఖ్యానిం చారు. ఎన్డీ యెను గెలిపిస్తే అభివృద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు. ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతో కూడిన కూటమి అని, ఈ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని షా అన్నారు. ఈ మహాఘట్‌బంధన్, లఠ్‌బంధన్‌లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని షా ఆరోపిం చారు. 'వాళ్లు బీహార్‌ను అభివృద్ధి చేస్తారా?' అని ప్రశ్నించారు. నయాపైసా కూడా అవినీతికి పాల్పడని నరేంద్రమోడీ, నితీశ్‌కుమార్‌లతో బీహార్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

# పురుషుడిపై మేల్‌నర్స్ లైంగికదాడి: యేడాదిజైలు, రెండు కొరడా దెబ్బల శిక్ష

**సింగపూర్‌సిటీ, అక్టోబరు 26 :** సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో స్టాఫ్‌మేల్ నర్సుగా పనిచేస్తున్న భారతీయుడు దారుణానికి పాల్పడ్డాడు. పురుషుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అతడిని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు ఒక సంవత్సరం రెండు నెలల జైలు శిక్షతో పాటు రెండు కొరడా దెబ్బలశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలు వరించింది. 34 ఏళ్ల ఏలిపె శివ నాగు సింగపూర్‌లోని రాఫెల్స్ ఆసుపత్రిలో మేల్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఈఏడాది జూన్ 18న ఆసుపత్రిలో చేరిన తన తాతను చూసేందుకు వచ్చిన ఓవ్యక్తిపై అతడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పేషెంట్ టాయిలెట్‌ను ఉప యోగిస్తుండగా శివనాగు గమనించాడు. ఆ తర్వాత, డిస్ఇన్‌ఫెక్ట్ చేస్తాననే నెపంతో బాధితుడి వద్దకు వెళ్లి, చేతికి సబ్బు రాసుకుని అతడిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూజీన్ ఫువా కోర్టుకు తెలిపారు.

# రాజస్థాన్‌లో భారీగా బంగారం నిక్షేపాలు



**జైపూర్, అక్టోబరు 26 :** దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు బంగారు నిల్వలపరంగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగు చూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. కంకారియాగారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో భుకియా జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల కోసం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో గెలిచిన సంస్థ.. అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలమైంది. దీంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను చెల్లించే సంస్థకు మైనింగ్ లైసెన్సును కేటాయించనున్నారు.

# సంక్షిప్తంగా..

## ఆర్జేడిలోకి మళ్లీ రావడం కంటే చావే మంచిది: తేజ్ ప్రతాప్



**పాట్నా, అక్టోబరు 26 :** బీహార్ మాజీ మంత్రి, ఆర్జేడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ పెద్ద కుమా రుడు తేజ్ ప్రతాప్‌యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్జెడిలోకి తిరిగి రావడం కంటే మర ణాన్నే ఎంచుకుంటానని అన్నారు. పార్టీతో కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన తేజ్ ప్రతాప్‌యాదవ్ జనశక్తి జనతాదళ్ పార్టీని స్థాపించారు. 2015లో తొలిసారి అసెంబ్లీ ఎన్ని కల్లో గెలిచిన మహువా స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు.కాగా, శుక్రవారం పిటిఐకి తేజ్ ప్రతాప్‌యాదవ్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్జేడికి తిరిగి వెళ్తారా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. 'ఆ పార్టీకి తిరిగి రావడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటా. అధికారం చేపట్టాలన్న ఆకలి నాకు లేదు. నైతిక సూత్రాలు, ఆత్మగౌరవం నాకు అత్యున్నతమైనవి' అని అన్నారు.

## యతీంద్ర అలా అనలేదు: సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు, అక్టోబరు 26 :** కర్ణాటకలో ముఖ్య మంత్రి మార్పు అంశంపై కొద్ది కాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ యతీంద్ర ఇటీవల చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దీనిపై సిద్ధరామయ్య తొలిసారిస్పందించారు. యతీంద్ర వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు. 'అసలు ఏమి చెప్ప దలచుకున్నావని యతీంద్రను నేను అడిగాను. తన సిద్ధాంతాల గురించే చెప్పాలని అనుకు న్నట్టు యతీంద్ర తెలిపాడు. ఫలానా వ్యక్తి సిఎంకావాలని యతీంద్ర అనలేదు' అని సిద్ధరామయ్య వివరించారు. బెళగావి జిల్లాలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో యతీంద్ర మాట్లాడుతూ తన తండ్రి రాజకీయకెరీర్ చివరి దశలో ఉందన్నారు. ఈ పరిస్థి తిలో బలమైన, ప్రగతిశీల భావ జాలం ఉన్ననాయకుడు కావాలని, ఆయనకు సిద్ధరామయ్యమార్గదర్శకంగా ఉంటారని చెప్పారు. సతీష్ జార్కిహోళికి ఆలక్షణాలు ఉన్నాయని చెప్పారు.


## లైంగికదాడిని ప్రతిఘటించిన యువతి హత్య

**పుణె, అక్టోబరు 26 :** పుణెలో 20 ఏళ్ల యువతిపై అత్యాచారానికి యత్నించి, ఆమె ప్రతిఘటించడంతో కిరాతకంగా హత్య చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. హవేలీ తాలుకాలోని ఉరులి కాంచన్‌కు చెందిన దినేశ్ సంజయ్ పటోలే(26) ఈ దారుణానికి పాల్పడినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోరెగావ్ ముల్ గ్రామానికి చెందిన బాధితురాలు ఈ నెల 14న రాత్రి 7:30గంటల సమయంలో రోడ్డు పక్కన శవమై కనిపించింది. ఆమె తలపై గాయంఉండటంతో ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. లోకల్ క్రైమ్‌బ్రాంచ్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్ అవినాశ్ శిలింకర్, ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సచిన్ వాంగ్డే నేతృత్వంలోని బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

## జర్నలిస్టులను కత్తులతో పొడిచి చంపిన దుండగులు

**ప్రయాగరాజ్, అక్టోబరు 26 :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దారుణం చోటుచేసుకుంది. లక్ష్మీ నారాయణ్ సింగ్ అలియాస్ పప్పు సింగ్ (54) అనే జర్నలిస్టును దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. నగరంలోని ఓ హోటల్ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ సింగ్‌కు మేనల్లుడు. పప్పు సింగ్‌పై కత్తులతో దాడిచేసిన నిందితులు ఆయన మెడ,పొట్ట,చేతులపై విచక్షణా రహితంగా పొడిచారు. ఆయన శరీరంపై 24కు పైగా లోతైన గాయాలయ్యాయి.తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆయన్ను వెంటనే స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రికితరలించారు.అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇద్దరు బాలీవుడ్ నటులపై చీటింగ్‌కేసు



**లక్నో, అక్టోబరు 26 :** ప్రముఖ బాలీవుడ్ నటులు శ్రేయస్ తల్పడే, అలోక్ నాథ్ చిక్కుల్లో పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక భారీపెట్టుబడి మోసం కేసు లో వీరిద్దరితోపాటు మరో 22 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లోని అర్బన్ మల్టీస్టేట్ క్రెడిట్‌అండ్ థ్రిఫ్ట్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో జరిగిన ఈ మోసంలో నటులు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారు. భాగ్‌పత్‌కు చెందిన బబ్లీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సొసైటీ ఏజెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, తాము సేకరించే డిపాజిట్లపై భారీ లాభాలు వస్తాయని, ప్రజలను నమ్మిం చారు. శ్రేయస్‌తల్పడే, అలోక్‌నాథ్‌వంటి ప్రముఖ నటులు ఈసంస్థకు ప్రచారం చేస్తుండటంతో చాలామంది వీరిమాటలు నమ్మి లక్షల్లో పెట్టుబడులుపెట్టారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సుమారు 500మంది నుంచి రూ. 5కోట్లకు పైగా వసూలుచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## వైద్యురాలి ఆత్మహత్యలో హౌస్ ఓనర్ కుమారుడు అరెస్టు

**సతారా, అక్టోబరు 26:** మహారాష్ట్రలోని సతారాలో వైద్యురాలి ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన ప్రశాంత్ బంకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. డాక్టర్ అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడే ఈ ప్రశాంత్ బంకర్. అరెస్ట్ అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (పీఎస్ఐ) గోపాల్ బదోనే పరారీలో ఉన్నాడు. బీడ్ జిల్లాకు చెందిన డాక్టర్ సంపద ముండే (28), ఫల్టాన్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారంరాత్రి ఆమె ఓ హోటల్ గదిలో విగతజీవిగా కనిపించారు. ఘటనాస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో, పీఎస్ఐ గోపాల్ బదానే గత ఐదు నెలలుగా తనపై అనేకసార్లు అత్యాచారం చేశాడని ఆమె ఆరోపించారు. ఇంటి యజమాని కొడుకు ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఆమె పేర్కొన్నారు. పోలీసులు ఆమె అరచేతిపై రాసి ఉన్న నోట్‌ను కూడా ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం పీఎస్ఐ గోపాల్‌తో కుమ్మక్కై ప్రశాంత్ బంకర్ డాక్టర్‌ను మానసికంగా వేధించాడు. అద్దె గదిని ఖాళీ చేయాలంటూ పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ ఆరోపణలు చేసిన పోలీసు అధికారులతో ప్రశాంత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై పోలీసులు అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు పోస్ట్‌మార్టం నివేదికలు తయారు చేయాలని ఆమెపై రాజకీయ, పోలీసు ఒత్తిళ్లు వచ్చాయని వారు ఆరోపించారు. ఈ విషయంపై ఆమె డీసీపీకి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసినా ఎవరూ పట్టించుకోలేదు. ఆమెకు న్యాయం జరగాలని ఆమె బంధువు ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్‌బంకర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న పీఎస్ఐ గోపాల్ బదానే కోసం ప్రత్యేకబృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

# మాతోకూర్చుని భోజనం చేసినవారే ద్రోహం చేసారు

## నాలుగోసీటు బిజెపి గెలుపుపై సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, అక్టోబరు 26 :** జమ్మూకశ్మీర్‌లో ఇటీవలే జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతృప్తి, అసంతృప్తి రెండూ వ్యక్తం చేశారు. నాలుగు స్థానాల్లో మూడింటిని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) గెలుచుకోవడం సంతోషంగా ఉన్నప్పటికీ, మిత్రపక్షాల దగా కారణంగా ఒక సీటును బీజేపీకి కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనగర్‌లో విలేకరులతో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ నాలుగు సీట్లనూ గెలుచుకోవడానికి నేషనల్ కాన్ఫరెన్స్ అన్ని విధాలా ప్రయత్నించింది. కానీ, చిరకాలంగా మాతో కూటమిలో ఉన్న కొందరు మిత్రులు చివరి నిమిషంలో మాకు ద్రోహం చేశారని ఒమర్ అన్నారు. మాతో కూర్చుని, మాతో కలిసి భోజనం చేసిన వాళ్లే చివరికి బీజేపీ వైపు నిలబడటం దురదృష్టకరం. నేను వారి పేర్లు చెప్పదలుచుకోలేదు, ప్రజల ముందు వారే దోషులుగా నిలబడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హంద్వారా ఎమ్మెల్యే సజ్జాద్ లోన్ ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం బీజేపీ అవకాశాలకు స్పష్టంగా మేలు చేసిందని సీఎం పేర్కొన్నారు. ఆయన కొన్ని కారణాల వల్ల ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నారు, కానీ ఆయన చర్య పరోక్షంగా బీజేపీకి లాభం చేకూర్చిందని ఒమర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, స్వతంత్ర శాసనసభ్యులకు ఒమర్ అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒక్క ఓటు కూడా వృథా కానందుకు నేను సంతృప్తిగా ఉన్నానని ఆయన అన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, ఇతర పార్టీల సభ్యులతో సహా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో కీలక ప్రజా సమస్యలను లేవనెత్తుతారని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను వారు పార్లమెంటులో బలంగా వినిపిస్తారు. అలాగే, ఈ ప్రాంత ప్రత్యేక హోదాకు సంబంధించి మా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని ముందుకు తీసుకెళతారని ఒమర్ స్పష్టం చేశారు. మరోవైపు, వినూత్నమైన ఉద్యానవన కార్యక్రమాల ద్వారా కశ్మీర్ లోయలో పర్యాటక సీజన్‌ను పొడిగించినందుకు ఫ్లోరికల్చర్ విభాగాన్ని సీఎం ప్రశంసించారు. కశ్మీర్‌లో వేసవి తర్వాత పూలు పూయవనే అపోహ ఉండేది. తులిప్ గార్డెన్‌తో పర్యాటక సీజన్‌ను ముందుగా ప్రారంభించి, గుల్‌ఎదావూద్ గార్డెన్‌తో పొడిగించడం ద్వారా పర్యాటకాన్ని గణనీయంగా పెంచవచ్చని మేము గ్రహించామని చెబుతూ, ఇందుకు కృషి చేసిన తోటమాలి, అధికారులందరినీ ఆయన అభినందించారు.

# బాలీవుడ్ సింగర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు



**ముంబయి, అక్టోబరు 26 :** ప్రముఖ బాలీవుడ్ గాయకుడు, సంగీత దర్శకుడు సచిన్ సంఘ్వీపై లైంగిక దాడి కేసు నమోదైంది. ఓ గాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబైలోని విలే పార్లే పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కెరీర్‌లో సాయం చేస్తానని చెప్పి తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని బాధితురాలు తన ఫిర్యాదులో ఆరోపించారు. బాధితురాలు, సచిన్ సంఘ్వీకి గతేడాది సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. 2024 ఫిబ్రవరి నుంచి 2025 జూలై వరకు తామిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, ఆ సమయంలో తనను తీవ్రంగా వేధించాడని ఆమె పేర్కొన్నారు. పెళ్లి ప్రస్తావన తెచ్చిన తర్వాత సచిన్ తనను దూరం పెట్టడం మొదలుపెట్టాడని, తమ సంబంధం గురించి బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, బలవంతంగా తనకు అబార్షన్ చేయించాడని కూడా ఫిర్యాదులో తెలిపారు. గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవడంతో పాటు, కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా ఈ ఏడాది ఆగస్టులో పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ ఆరోపణలపై సచిన్ సంఘ్వీ తరఫు న్యాయవాది ఆదిత్య మిథే స్పందించారు. నా క్లయింట్‌పై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ కేసులో ఎలాంటి పస లేదు. సచిన్‌ను చట్టవిరుద్ధంగా నిర్బంధించి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. అన్ని ఆరోపణలను మేము కోర్టులో తిప్పికొడతామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బాధితురాలి తరఫు న్యాయవాది మాట్లాడుతూ, మా క్లయింట్‌కు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. నిందితుడు ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తి అయినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని తెలిపారు. ఈ కేసు విచారణలో ఉన్నందున మరిన్ని వివరాలు వెల్లడించలేమని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్): ఈ నెల 27 తేదీ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, అంగన్‌వాడీ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోంత తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 27 తేదీ సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## 'మొంథా' తుఫాన్ దృష్ట్యా పీ.జి.ఆర్.ఎస్. కార్యక్రమం తాత్కాలిక రద్దు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): 'మొంథా' తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జరగవలసిన పీ.జి.ఆర్.ఎస్. (పోలీస్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

అధిక వర్షాలు, గాలివానల మధ్య ప్రజల భద్రత ప్రధానమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ తుఫాన్ సమయంలో అప్రయోజనంగా బయటకు వెళ్లరాదని, ముంపు ప్రాంతాల సమీపంలో తిరగకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని, లేదా డయల్ 112 నంబర్ ద్వారా వెంటనే పోలీస్ సహాయం పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని ప్రజల రక్షణకు పోలీసులు అన్ని స్థాయిల్లో సిద్ధంగా ఉన్నారని, తుఫాన్ ప్రభావం తగ్గేవరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వకుల్ జిందాల్ తెలిపారు.

## బీజేపీ, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గుంటూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటురు తూర్పు అసెంబ్లీ 55వ డివిజన్‌లోని వెంగయ్య నగర్ 4వ లైన్‌లో బీజేపీ నాయకులు గట్టుపల్లి అబ్రహం నేతృత్వంలో, శంకర్ కంటి ఆసుపత్రి మరియు భారతీయ జనతా పార్టీ సంయుక్తంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తమ కంటి ఆరోగ్యపరమైన పరీక్షలు చేయించుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ, "శంకర్ కంటి ఆసుపత్రి ప్రోత్సాహంతో ఇక్కడ ఈ మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించాం. ఇది పూర్తిగా పేద ప్రజలకు ఉచితంగా సేవలు అందించడానికే ఏర్పాటు చేయబడింది. ఆసుపత్రికి వెళ్లి ప్రత్యేకంగా పరీక్షలు చేయించుకోవాలంటే అధిక ఖర్చుతో పాటు సమయం కూడా వెచ్చించాలి. ఇక్కడ అందిస్తున్న ఉచిత సేవల వల్ల ప్రతి కుటుంబానికి ఉపయోగపడుతుంది," అని పేర్కొన్నారు.

అలాగే, పౌష్టికాహార లోపాల కారణంగా చిన్న పిల్లలు నుండి పెద్దవారు దాకా చూపు సమస్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లు ఎక్కువగా ఉపయోగించే పరిస్థితిలను తగ్గించాలన్నారు. పౌష్టికాహారమున్న నాణ్యమైన తినుబండారాలు అందిపెట్టడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుదలకు సహాయపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తంగా లక్ష్మణ్ రావు, మండల నాయకులు రావుల రాజశేఖర్, గణ పదర, నాగయ్య, ఆర్. కుమార్ (మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి), జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్/ఎంఎస్పీ నగర అధ్యక్షులు దావులూరు కుమార్ మాదిగ, శంకర్ కంటి ఆసుపత్రి రవి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు భారీ గుంతకు మరమ్మతులు



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం నుంచి ఏపీ సచివాలయం వైపు వెళ్లే బీటీ రహదారి పై ఏర్పడిన భారీ గుంతకు మరమ్మతులు చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనంపై నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అధికారులు యుద్ధప్రాతిపదికన భారీ గుంత కు మరమ్మతులు చేపట్టారు. పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడైన మహానాయకుడు ఎన్టీఆర్

- బ్రహ్మంగారిమఠంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): కడప జిల్లా కందిమల్లయ్యపల్లె గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి కాకతీయ కమ్మ వారి అన్నదాన సత్రం వద్ద టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మహానటుడు అన్న నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ బ్రహ్మం గారి మఠం అంటేనే జ్ఞాన భూమి. బ్రహ్మం గారి కాలజ్ఞానం ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. అలాంటి పవిత్ర స్థలంలో మహానాయకుడు నందమూరి తారకరామారావు విగ్రహం ప్రతిష్ఠించడం ఎంతో గౌరవప్రదమైన ఘట్టం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఎన్టీఆర్ నటుడిగా మాత్రమే కాకుండా, మహానాయకుడిగా. ఆయన వేసిన ముద్ర చెరగని ముద్ర. ప్రతి ఒక్కరి మనసులో, గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారన్నారు. ఆయన స్ఫూర్తితోనే తెలుగు ప్రజలు నేటికీ ముందుకు సాగుతున్నారు," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

అలాగే, "కాకతీయ అన్నదాన సత్రం శ్రీశైలంలో భక్తులకు చేస్తున్న సేవలు ఎంతో విశిష్టం. అదే స్ఫూర్తితో బ్రహ్మం గారి మఠంలో ఏర్పాటైన సత్రం భక్తజనులకు అండగా నిలుస్తోంది. ఇది ఎంతో పుణ్యకార్యం," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

మా నాన్న ప్రతి సంవత్సరం బ్రహ్మం గారి మఠానికి వచ్చి మాల వేసుకునేవారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎటు చూసినా అభివృద్ధి కనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ లాంటి నాయకుల వల్ల ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది," అని తెలిపారు.

గుంటూరు నుంచి తనను ప్రత్యేకంగా ఆహ్వానించిన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

- నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ చైర్మన్ల సమావేశం
- పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షులుగా పూనాటి ఎంపిక
- ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) పల్నాడు జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డ్ చైర్మన్ల సమావేశం ఆదివారం నరసరావు పేట మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులుగా నరసరావు పేట మండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై, రైతుల సంక్షేమం కోసం ఉమ్మడి కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ "ఉమ్మడి కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మార్కెట్ యార్డ్ కమిటీలను ఏర్పాటు చేసి, వాటిని బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ఆదివారం పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షులుగా పూనాటి శ్రీనివాసరావు ఎన్నిక కావడం సంతోషకరం. ఈ కమిటీ రైతుల ప్రయోజనాల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని నమ్ముతున్నాను," అని అన్నారు.

ఈ సందర్భంగా, జిల్లా మార్కెట్ యార్డ్ కమిటీలు రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయడం, వ్యవసాయ పరికరాలను అందజేయడం, గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. "మార్కెట్ యార్డ్‌ల ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు, సమాచారం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రవ్యాప్త మార్కెట్ యార్డ్ చైర్మన్ల కమిటీ ఏర్పాటు పూర్తయిన వెంటనే, ఈ కమిటీలకు నిధులు విడుదల చేయడం జరుగుతుంది," అని డాక్టర్ అరవింద బాబు వెల్లడించారు. మొత్తం 12 మార్కెట్ యార్డులకు గాను 10 మార్కెట్ యార్డులకు చైర్మన్ లను నియమించారు. 2 మార్కెట్ యార్డులో చైర్మన్ ల ఎన్నిక పెండింగ్ లో ఉంది. సమావేశంలో పల్నాడు జిల్లాలోని 10 మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా జరిగేలా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో పౌష్టికాహారం

- జి ఐ ఎస్ టి ప్రతినిధుల బృంద సందర్శన



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో రైతు సాధికార సంస్థ అమలు చేస్తోన్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల పురోగతిని పరిశీలించడానికి జి ఐ ఎస్ టి సంస్థ ఛైర్‌పర్సన్ ఆండ్రే హాఫ్‌మాన్ సీఈఓ పవన్ సుఖ్‌దేవ్ ఆదివారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం దావులూరు పాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహార ఉత్పత్తులు పౌష్టికతతో నిండి ఉంటాయని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇలాంటి ఆహారపు అలవాట్లు కీలకమని వివరించారు. బృంద సభ్యులు గ్రామంలోని మహిళా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన ఏటీఎం, సూర్య మండలాలను పరిశీలించారు. ఈ గ్రామంలో పండించే ఆకుకూరలు, కూరగాయలు గర్భిణీ స్త్రీలు మరియు కిశోర బాలికలకు రోజువారీ పౌష్టికాహారంగా అందుతాయని వారికి వివరించారు. కుటుంబ వినియోగానికి అవసరమైన ఉత్పత్తులను ఉపయోగించుకుని, మిగతా ఆకుకూరలు మరియు కూరగాయలను అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రతీ సోమవారం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏర్పాటు చేసే ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు మహిళా సంఘ సభ్యులు తెలిపారు. దీనివల్ల ప్రతి కుటుంబం ప్రతినెల రూ.3000 నుండి రూ.4000 వరకు ఆదాయం పొందుతున్నట్లు వారు బృందానికి వివరించారు. ఇక గ్రామ మహిళలు ఫుడ్ బాస్కెట్ ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేసి, గర్భిణీ స్త్రీలు మరియు కిశోర బాలికలకు అందించే చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టిక పదార్థాలను బృంద సభ్యులకు చూపించారు. ఈ సందర్భంగా బృందం పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, అకాడమీ అడ్వైజర్ చంద్రశేఖర్ , థిమాటిక్ లీడ్స్ లక్ష్మీదుర్గ, వాణిశ్రీ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): పెదవడ్లపూడిలో గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్ తన మనవడు చిఎం వేదాన్స్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న గ్రామానికి చెందిన పేద విద్యార్థిని ఆవుల శిరీష కు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ హాజరై విద్యార్థిని శిరీష కు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చంద్రశేఖర్ తన మనవడు వేదాన్స్ పుట్టినరోజున పేద విద్యార్థినికి విద్యను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి వ్యక్తి చంద్రశేఖర్ ను ఆదర్శంగా తీసుకొని తమ కుటుంబంలో జరిగే శుభకార్యాల సందర్భంలో పేద విద్యార్థుల విద్యను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందించాలన్నారు. వేదాన్స్ సంపూర్ణ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయపాటి రమేష్, అన్నే నంద కిషోర్, మాదల రమేష్, జాలాది సందీప్, బొర్రా శ్రీకాంత్, కొప్పాక ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం




- ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యం
- మోటార్ రంగానికి అండగా ప్రభుత్వం
- గుంటూరు సిటీ బేరింగ్ డీలర్స్ అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక గుంటూరు సిటీ బేరింగ్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. విశాఖ గూగుల్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో లక్షల మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆశయ సాధన మేరకు యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఆటో పరిశ్రమకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, తద్వారా ఎందరో కార్మికులు, వ్యాపారులు లబ్ధి పొందనున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానం ద్వారా కొత్త పరిశ్రమలకు పచ్చతివాచీ పరిచామన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు పారిపోయాయని, ఇప్పుడు మళ్లీ ఆంధ్ర వైపు పారిశ్రామికవేత్తలు చూస్తున్నారని తెలిపారు.

## హెూమియో వైద్యం ఆరోగ్యభాగస్వామి



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): హానిమన్ అందించిన హెూమియో వైద్యం ద్వారా లభించిన పరిపూర్ణ ఆరోగ్యంతో, హెూమియొ వైద్యంపై పట్టు సాధించేందుకు 16 సంవత్సరాల పాటు భిన్నమైన వ్యక్తుల లక్షణాలకు, ఏమందు ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమనే అంశాన్ని అవపోసన పట్టి, ఉచిత హెూమియో సేవలను నేటికీ కొనసాగిస్తున్నామని, దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన హెూమియొ వైద్యులు కూరపాటి వెంకటేశ్వరరావు, మానవత సంస్థ, విశిష్ట వ్యక్తి సత్కారం అందుకున్న క్రమంలొ తమ అనుభవాలను సభికులతో పంచుకున్నారు.

మానవతా స్వచ్ఛంద సంస్థ సర్వసభ్య సమావేశం ఆదివారం, ప్రకాశం రోడ్ లోని ఏఎస్ఎన్ కళాశాల లైబ్రరీ ప్రాంగణంలో, సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షతన నిర్వహించారు. సమాజానికి తనవంతుగా విశిష్ట సేవలు అందించే వ్యక్తులను సత్కరించుకునే కార్యాచరణలో భాగంగా, గత 40 సంవత్సరాలుగా, ఉచిత హెూమియో వైద్య సేవలు అందిస్తూ, ఎంతోమందిని తమ వైద్య సేవలు ద్వారా ఆరోగ్యవంతులను చేసిన, హెూమియో వైద్యులు కూరపాటి వెంకటేశ్వరరావుకు విశిష్ట వ్యక్తి సత్కారాన్ని, వేదాశీర్వచనములతొ అందజేశారు. సత్కార గ్రహిత వెంకటేశ్వరరావు హెూమియొ వైద్యం, గుణగణాలను, తమ అనుభవాలను సభికులతొ పంచుకున్నారు. సంస్థ గౌరవ చైర్మన్ కుమార్ పంప్స్ సంస్థ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతు, మానవత సంస్థ తెనాలి శాఖ, స్పష్టమైన కార్యాచరణతొ, సేవాకార్యక్రమాలను నిర్వహించడం, విశిష్ట వ్యక్తులను సత్కరించి, వారి అనుభవాలను తెలుసుకుని, వారి స్ఫూర్తితొ మరికొన్ని మంచి సేవలు సమాజానికి అందించే విధానం అభినందనీయ మన్నారు. సత్కార గ్రహీత వెంకటేశ్వరరావు ఉచిత హెూమియొ వైద్యసేవలు స్ఫూర్తిదాయక మన్నారు. సంస్థ కార్యాచరణను, చైర్మన్ కొలసాని రామ్ చంద్ మీడియాకు వివరించారు. మానవతా సంస్థ నిర్వాహక కమిటీ, కార్యవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా సామూహిక సత్యదేవ వ్రతపూజలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాస ప్రాధాన్యతా క్రమంలొ, కేశవునికి ప్రీతిగా, శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధానంలొ సామూహిక సత్యదేవ వ్రత పూజలు వరుసగా నాలుగు ఆదివారములు నిర్వహించే కార్యాచరణ ప్రారంభించామని ఆలయ ఇఒ అనుపమ పేర్కొన్నారు. ద్వితీయ తిరుపతిగా భాసిల్లుతున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధానంలొ, సామూహిక శ్రీ రమా సహిత శ్రీసత్యన్నారాయణ స్వామి వ్రతపూజలు, ఆదివారం ప్రారంభ సందర్భంగా 75, మంది దంపతులు, వ్రత పూజలలో పాల్గొన్నారు. తిరుపతి దేవస్థాన వేదపాఠశాలలొ, వేదాధ్యయనం చేసిన, గంజాం సాయివరుణ్, ఆలయ అర్చక స్వామి రత్నాకరం సత్యనారాయణ గౌతమ్ లు, వ్రత పూజలు, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈఒ, అనుపమ మాట్లాడుతు కేశవునికి ప్రీతిగా, ఈ కార్తీక మాసంలొ, ప్రతి ఆదివారం సామూహికంగా, సత్యదేవుని వ్రత పూజలు ఉంటాయని, సంకల్పం ఉన్న భక్తులు, వెయ్యి రూపాయాల రుసుము చెల్లించి, గోత్రనామాలు, ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈవిశిష్ట కార్యక్రమంలొ ఆలయ అర్చక స్వామి ఆఎస్. గౌతమ్ ,ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ కుంభం సాయిబాబు, ఎమ్. శ్రీనివాసరావు, రవిశంకర్, కార్యాలయ సిబ్బంది, స్వశ్చంద వాలంటీర్లు పూజా విధులకు సహకరించారు.

## మొంథా తుఫాన్... అప్రమత్తంగా ఉండాలి

- ప్రాంతీయ. ప్రత్యేక అధికారి ఆర్. పి సిసోడియా వెల్లడి
- జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): మొంథా తుఫాన్ దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రాంతీయ ప్రత్యేక అధికారి ఆర్.పి.సిసోడియా అన్నారు. జిల్లా పరిస్థితులపై సమీక్షించుటకు ఆదివారం గుంటూరు విచ్చేసిన ప్రత్యేక అధికారి కంట్రోల్ రూమ్ కార్యకలాపాలను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. తీవ్ర తుఫానుగా పరిణామం చెందుతున్న తరుణంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఆహార నిలువలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరు ఉండరాదని అన్నారు. బలహీనంగా ఉన్న గోడలు, పూరి గుడిసెలు వంటి వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బలహీనంగా ఉన్న చెట్లు, పడిపోవడానికి అవకాశం ఉన్న చెట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ రంపాలు (పవర్ సాస్) సిద్ధంగా పెట్టుకుని చెట్లు పడితే తక్షణం తొలగించుటకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గండి పడుటకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి వెంటనే గండి పూడ్చుటకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న కాజ్ వేలు వద్ద రెవిన్యూ, పోలీస్ ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగు నీరు ఎక్కడా కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం కలిగితే తాగు నీటిని పంపింగ్ చేయుటకు జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. తాగు నీటి అంతరాయం ఉండరాదని చెప్పారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయిన వెంటనే పునరుద్ధరణ చేయుటకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కాలువల్లో పూడికలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం, పశువుల ప్రాణ నష్టం జరగరాదని చెప్పారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించుటకు వాహనాలు సిద్ధంగా ఉండాలని, వాటికి ఇంధనం అవసరమైతే బ్యాంకులను అనుసంధానం చేయాలని తెలిపారు. వృద్ధులు, పిల్లలకు ఉంటారని వారికి పాలు, బిస్కెట్లు వంటివి సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మొబైల్ టవర్లు నిరంతరం పనిచేయాలని, మొబైల్ ఆపరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మొబైల్ ఫోన్ లలో అందుబాటులో ఉండాలని అన్నారు. రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని పొలంలో ఉన్న పంటలు ఎటువంటి నష్టానికి గురి కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం గత తుఫాన్లు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు రానున్న నాలుగు రోజులు సహాయక సన్నద్ధత చర్యలపై పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ మురుగు నీరు కాలువలు పూడికలు తీయటం జరిగిందని చెప్పారు.

పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ మందులు, దానా సిద్ధంగా ఉందని, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

జిల్లా అధికారులు శాఖల వారీగా చేపడుతున్న చర్యలను వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని బీమా విధానంగా మార్చాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, పింఛన్‌దారులు మరియు వారి ఆధారిత కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం అమలు చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పథకం అత్యంత దయనీయ స్థితిలో ఉందని, దానిని పునరుద్ధరించి సమర్థవంతమైన ఆరోగ్య బీమా విధానంగా మార్చాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి ఇంజినీరింగ్ శాఖ పదవీవిరమణ చేసిన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి. ఎం. బి. బుచ్చిరాజు కోరారు.
నగదు రహిత వైద్య సేవల కోసం ప్రారంభించిన ఈ పథకం ప్రస్తుతం సరిగా పనిచేయడం లేదని ఆయన తెలిపారు. ఆస్పత్రుల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం, వైద్య ప్యాకేజీల రేట్లు పాతబడిపోవడం, అనేక ఆస్పత్రులు ఎంపానెల్‌మెంట్ నుంచి తప్పుకోవడం వంటి కారణాల వల్ల వేలాది మంది వృద్ధ పింఛన్‌దారులు చికిత్స కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రతి నెలా ఉద్యోగులు, పింఛన్‌దారుల నుండి క్రమం తప్పకుండా నిధులు వసూలు చేస్తున్నప్పటికీ, తగిన సేవలు అందడం లేదని ఆయన విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు కలిసి ప్రతి సంవత్సరం దాదాపు రూ. 360 కోట్లు ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం చెల్లిస్తున్నారని, అందులో పింఛన్‌దారుల వాటా రూ. 120 కోట్ల నుండి రూ. 150 కోట్ల వరకు ఉందని వివరించారు.
ఆస్పత్రులు బకాయిల కారణంగా ఉద్యోగుల ఆరోగ్య పథకం రోగులను స్వీకరించడం మానేశాయని, ఫలితంగా వృద్ధులు తమ స్వల్ప పెన్షన్ మొత్తాన్ని వైద్య ఖర్చులకు వెచ్చించాల్సి వస్తోందని బుచ్చిరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య పథకం స్థానంలో సమగ్ర ఆరోగ్య బీమా పథకం ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.
ప్రతి ఉద్యోగి, పింఛన్‌దారు మరియు వారి ఆధారిత కుటుంబ సభ్యులకు సంవత్సరానికి రూ. 5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు జారీ చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఆస్పత్రులు నేరుగా బీమా సంస్థలతో లావాదేవీలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.
పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రుల బిల్లులను తక్షణం విడుదల చేయడం, వైద్య ప్యాకేజీల రేట్లు ప్రస్తుత ఖర్చులకు అనుగుణంగా సవరించడం, పారదర్శక చెల్లింపు వ్యవస్థ, ఆన్‌లైన్ ట్రాకింగ్, 24×7 ఫిర్యాదు పరిష్కార కేంద్రం ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పర్యవేక్షణలో ట్రస్ట్ ఏర్పాటు చేసి బీమా సంస్థల సేవలను పర్యవేక్షిస్తే పారదర్శకత, సమర్థత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.
పింఛన్‌దారుల వేదన పరిపాలనా లోపమే కాక మానవతా అంశమని బుచ్చిరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ సేవకు తమ జీవితాన్ని అర్పించిన వృద్ధులు వృద్ధాప్యంలో కేవలం ఆరోగ్య రక్షణ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుంటే వేలాది మంది పింఛన్‌దారులకు కొత్త ఆశ, జీవం లభిస్తుందని అన్నారు. "సేవ చేసిన వారిని కాపాడటం ఎ అదే మంచి పరిపాలనకు నిదర్శనం" అని బుచ్చిరాజు వ్యాఖ్యానించారు.

## ప్రైవేటు ట్రావెల్స్‌పై అరికట్టండి... ఆర్టీసీ సర్వీసులు దూరప్రాంతాలకు విస్తరించాలి

- ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ప్రభుత్వం కట్టడి చేసి, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే విధంగా ఆర్టీసీ సేవలను దూరప్రాంతాలకు విస్తరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. భారత్‌లో అత్యంత సురక్షిత ప్రజారవాణా సంస్థగా నిలిచింది ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తెలిపారు.
రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి. వి. నరసయ్య శనివారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణీకుల అవసరాల మేరకు ఏసీ, స్లీపర్ బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దొంగ పర్మిట్లతో ఇతర రాష్ట్రాలలో నమోదైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయన్నారు. వార్షికంగా సుమారు రూ. 1500 కోట్ల మేర ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
శుక్రవారం కర్నూలులో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం అత్యంత దుర్ఘటనగా వర్ణిస్తూ, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం అనివార్యమని అన్నారు. తక్కువ జీతాలకు అనుభవం లేని డ్రైవర్లను నియమించడం, వేగ పరిమితులు పాటించకపోవడం, డబుల్ డ్రైవర్ లేని వాహనాలను నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని దామోదరరావు అభిప్రాయపడ్డారు. ప్రయాణీకులు వేగం కంటే సురక్షిత ప్రయాణాన్నే ప్రధానంగా తీసుకోవాలని, ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్టీసీ బస్సులను ప్రోత్సహించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## డీఈఓ పదోన్నతుల్లో అసిస్టెంట్ డైరెక్టర్లను మినహాయించాలి

- పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ఉప విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు ఇవ్వాలి.

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వన్ టైం ఎక్సెంప్షన్ క్రింద గతంలో 12. సైకిల్ పాయింట్ లలో ఉన్న పోస్టులు కంటే అధికంగా ఒకేసారి అసిస్టెంట్ డైరెక్టర్లు డీఈవోలు/డీ. డీ. లు గా పదోన్నతులు పొంది ఉన్నారని ఇప్పటికే వారు అదనం గా ఉన్నందున డివో పదోన్నతుల్లో ఏడీలను అడిక్వసి గా పరిగణించి డీఈవో పదోన్నతుల నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాసరావు లు ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 505 మరియు 73 ప్రకారం ప్రతి 12 మంది లో కేవలం ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు మాత్రమే డిఈవోలుగా పదోన్నతి కల్పించాల్సి ఉండగా డివైఓ పోస్టు ఖాళీగా ఉన్నందున మరియు ఇతర పాయింట్ సైకిల్లో వారు లేనందున దాదాపు 19 మంది అసిస్టెంట్ డైరెక్టర్ లకు వన్ టైం ఎక్సెంప్షన్ క్రింద పదోన్నతులు కల్పించడం జరిగిందని అదేవిధంగా వీరి క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారం దాదాపు 80 మంది అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఉండాల్సి ఉండగా దీనికి అదనంగా మరో 40 మంది వరకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొంది ఉన్నారని ఇది అసంబద్ధమనీ బోధనేతరులను విద్యాశాఖ అధికారులుగా నియమించడం వలన విద్య వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని, ఇప్పటికే 40 శాతం మంది పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను వీడారని విశదీకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల మనుగడ కొనసాగించాలంటే విద్యా వ్యవస్థలో సంస్కరణలు నూతన జాతీయ విద్యా విధానం సిపార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే బోధన అనుభవం కలిగి ఉన్నటువంటి ఉపాధ్యాయులను మరియు డైట్ లెక్చరర్లు విద్యాశాఖ అధికారులు గా నియమిస్తేనే సాధ్యమని ఉదహరించారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల అభివృద్ధి దృష్ట్యా పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను ఉపవిద్యా శాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించి 12. సైకిల్ ను అమలు చేయటం ద్వారా వీరి నుండి జిల్లా విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని అంతవరకు ఇప్పటికే అధికంగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ల ను పదోన్నతుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

# తుఫాన్ కారణంగా ప్రాణ, ఆస్థి నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు

- ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలి రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు(జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ కారణంగా ఏలూరు జిల్లాలో ఎలాంటి ఆస్థి, ప్రాణ నష్టాలు కలగకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లను ఆదేశించారు. మొంథా తుఫాన్ పరిస్థితిపై జిల్లాలో పరిస్థితిని, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఆదివారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లను మంత్రి పార్థసారధి టెలిఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన మొంథా తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున, రాబోయే 3 రోజులపాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలలోని వయో వృద్దులు, గర్భిణీలు, విభిన్న ప్రతిభావంతులు, చిన్నపిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తీవ్రమైన గాలులు, భారీ వర్షాలకు హోర్డింగ్లు, స్థంబాలు వంటివి నెలకొరిగే అవకాశం ఉన్నందున భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.
త్రాగునీరు, పారిశుధ్యం,విద్యుత్ సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో సహాయ చర్యలు కేంద్రాలు పక్కాగా ఏర్పాటు చేయాలని, జిల్లా, మండల అధికారులు సమన్వాయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ,రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మెడికల్,అగ్రికల్చర్, ఇరిగేషన్,పంచాయతీరాజ్, ఆర్%డ%బి, అధికారులందరూ అప్రమత్తతో ఉండి సమన్వయంతో పని చేసి నివారణ చర్యలు నిర్వహించాలన్నారు. భారీ వర్షాల కారణంగా వాగులు, కల్వర్టులు, కాజ్ వే ల వద్ద వరద నీటి ఉధృతి కారణంగా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల స్థాయిలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేసి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, , త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నూజివీడు నియోజకవర్గంలో ఉద్యాన వనాలు, ఆపరాలు,కూరగాయలు, వరి. తదితర పంట నష్టము కలుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఎంత మేర నష్టం వాటిల్లిందో పూర్తి వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయలన్నారు. వర్షాల కారణంగా చెట్లు కూలి రవాణా సౌకర్యాలకు అంతరాయం కలగకుండా తక్షణమే చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొంటానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆ సమయంలో ప్రజలను సాధ్యమైనంత మేర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, బయట ప్రదేశాలలు, చెట్లు కింద నిలబడ వద్దని, నదులు, చెరువులవద్ద ఉండవద్దని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనుక్షణం ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి పార్థసారధి అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా తుఫాన్ పరిస్థితిని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లు మంత్రి పార్థసారథికి వివరించారు.

# ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా అప్రమత్తంగా ఉండాలి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నగర ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర సూచించారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో కలిసి అత్యవసర సమావేశం నిర్వహించి తుఫాన్ పరిస్థితులపై సమీక్ష చేశారు. మేయర్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్‌ను గుంటూరు నగరంలో సమర్థవంతంగా ఎదుర్కొని ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రానున్న మూడు రోజుల్లో తీవ్ర గాలులతో కూడిన భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరంలో అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.
నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఆస్తి మరియు ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందితో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగర ప్రజలు తమ ప్రాంతాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 0863-2345103
వాట్సఅప్ నెంబర్: 9849908391కమిషనర్ తెలిపారు, నగరంలో గత తుఫాన్ల అనుభవాల ఆధారంగా గుర్తించిన 12 లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించామని చెప్పారు. అలాగే, వార్డ్ సచివాలయాల కేంద్రంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు.
తుఫాన్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మేరకు ముందస్తు మరియు అనంతర చర్యల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మేయర్ సూచించారు. ఎక్కడైనా అశ్రద్ధ వలన అవాంచనీయ సంఘటనలు జరిగితే సంబంధిత అధికారి, కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాష మాట్లాడుతూ, ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలు పాటిస్తే ప్రాణ, ఆస్తి నష్టం తప్పించుకోవచ్చని అన్నారు.
డిప్యూటీ మేయర్ షేక్ సజిలా మాట్లాడుతూ, అధికారులు మరియు సచివాలయ కార్యదర్శులు తుఫాన్ ప్రభావం, జాగ్రత్తలు, అవసరమైన సూచనలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మొత్తంగా, తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకుని నగర పరిపాలన యంత్రాంగం సర్వసిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జ్ యస్. ఈ సుందరరామి రెడ్డి, కార్పొరేటర్లు,అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం నోబుల్ టీచర్స్ వినతి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలన్న విజ్ఞప్తితో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం గుంటూరులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు మాట్లాడుతూ టెట్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఇప్పటికే అనుభవం ఉన్నవారని, వారికి మినహాయింపు లేదా సడలింపులు కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని ఆయన కోరారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి చట్ట సవరణ జరపాలని సూచించారు.
గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కరరావు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా సంవత్సరానికి మూడుసార్లు టెట్ పరీక్షలు నిర్వహించవచ్చని, ఆయా సబ్జెక్టుల్లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.
వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతానని, ఉపాధ్యాయుల పక్షాన ప్రభుత్వం నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. టెట్ విషయంలో ఉపాధ్యాయులకు అనుకూలంగా నిర్ణయం తీసుకునే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి. లలితబాబు, ఉపాధ్యక్షుడు ఏ. వి. కృష్ణారావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా, గుంటూరు నగర అధ్యక్షుడు కె. వి. రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కే. వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు టి. రవి తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుఫాను ప్రభావంతో 27, 28, 29 తేదీలలో గుంటూరు నగరంలో కూడా భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలని సూచించారు. చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని సూచించారు. ప్రభుత్వము ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలోని ప్రతి డివిజన్‌కు ఒక అధికారి నియమించినట్లు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఆ అధికారులను సంప్రదించాలని సూచించారు. తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు పోలీసు, ట్రాఫిక్, ఫైర్, మున్సిపల్ శాఖలతో సమన్వయం కలిగి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా, ఇంటి వద్దే జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సహాయం అందించేందుకు ఎన్డీయే కూటమి నేతలు కూడా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గుంటూరు నగర తుఫాన్ కంట్రోల్ రూమ్ నెంబర్
గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్: 0863-2345103

# సామాన్య కార్యకర్తను అందలం ఎక్కించిన ఏకైక పార్టీ జనసేన

- సాధారణ జన సైనికుడికి పదవి ఇచ్చిన నాయకుడు పవన్
- నిజాయతీగా పని చేసే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుంది
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ యువతకు పెద్ద పీట
- కూటమి ధర్మాన్ని పాటిస్తూ.. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లండి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** సామన్య కార్యకర్తను అందలం ఎక్కించిన ఏకైక పార్టీ జనసేన అని, సాధారణ జన సైనికుడికి అసాధారణ పదవి ఇచ్చిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ కార్యకర్తలను గుర్తిస్తారు అనడానికి కొట్టే సాయి ప్రసాద్ నిలువెత్తు నిదర్శనమన్నారు. పార్టీ కోసం బలంగా నిలబడిన సామాన్య కార్యకర్తను దేశంలోనే పేరున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ బోర్డు ఛైర్మన్ గా నిలబెట్టారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ యువతకి తగిన అవకాశం కల్పించాలని పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పార్టీ కోసం నిజాయితీగా నిలబడే వ్యక్తులను ప్రోత్సహిస్తూ, కొత్త నాయకత్వాన్ని తీసుకురావాలన్నదే జనసేన లక్ష్యమని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి ప్రయాణం సాగించే ప్రతి ఒక్కరు విజయం సాధిస్తారన్నారు.
ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఛైర్మన్ గా కొట్టే సాయి ప్రసాద్, బోర్డు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన పగడాల మురళీ, దండి రాఘవయ్యలను అభినందించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో శాసన సభ విప్ అరవ శ్రీధర్, శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, కూటమి నేతలు పాల్గొన్నారు.
అనంతరం శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "ఒక సామాన్య కార్యకర్త ఈ స్థాయికి ఎదగాలంటే అది జనసేనతోనే సాధ్యం. పార్టీ కోసం బలంగా నిలబడిన ప్రతి కార్యకర్తకు ఇక్కడ గుర్తింపు దక్కుతుంది. కొట్టే సాయి సామాన్య కార్యకర్త కాదు.. పార్టీ కోసం బలంగా నిలబడిన కార్యకర్త. పార్టీ అధినేత ఆదేశాలకు అనుగుణంగా బలంగా పని చేసిన కార్యకర్త. పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం, జనసేన పార్టీ విజయం కోసం అహర్నిశలు పని చేసిన వ్యక్తి. పార్టీ ఆదేశాలను తు.చ. తప్పకుండా ముందుకు తీసుకువెళ్లిన వ్యక్తి. పార్టీని నమ్ముకుని గత ప్రభుత్వ దుర్మార్గాలను ఎదురించి నిలబడ్డారు. ఆ క్రమంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న సమయంలో ఒక పోలీస్ అధికారి ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఘటన జరిగిన మూడు రోజులకే పవన్ కళ్యాణ్ స్వయంగా వచ్చి సదరు సీఐపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆ రోజే కొట్టే సాయిని గుర్తించారు. జనసేన పార్టీ మన కోసం, మన భవిష్యత్తు కోసమే ఉందన్న విషయాన్ని ప్రతి కార్యకర్త తెలుసుకోవాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ యువతకు పెద్ద పీట వేయాలని అధ్యక్షులు భావిస్తున్నారు. గెలుపు, ఓటములు ప్రజలు నిర్ణయిస్తారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మంచి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. తిత్లీ తుఫాను సమయంలో 25 కేజీల బియ్యం కాదు, మాకు 25 సంవత్సరాల భవిష్యత్తు కావాలి అన్న శ్రీకాకుళం యువత మాటలను స్ఫూర్తిగా తీసుకుని పవన్ కళ్యాణ్ ముందుకు వెళ్తున్నారు. వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రాన్ని దేశంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలి. అదే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ముందుండేలా మనమంతా పని చేయాలి. ప్రతి కార్యకర్త పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలి.

### రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి

చాలా మంది నాకు పదవి ఎందుకు రాలేదు అని అనుకుంటున్నారు. మనం కూటమిలో భాగస్వాములుగా ఉన్నాం. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారు. కూటమిలో ఉన్నాం కదా అన్ని పదవులు మనకే వస్తాయనుకోవద్దు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలి అన్న నిర్ణయం పవన్ కళ్యాణ్ నిర్ణయిస్తారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ దేశంలోనే 100 శాతం స్ట్రయిక్ రేట్ సాధించిన పార్టీగా చరిత్ర సృష్టించింది. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ నాయకత్వం అవసరం అని భావించి ప్రజలు ఇంత భారీ మెజారిటీ కట్టబెట్టారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, కూటమి కోసం పవన్ అహర్నిసలు పని చేశారు. ఈ రోజున అదే రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి 15 సంవత్సరాలు నిలబడాలని కోరుకుంటున్నారు.

### యువత భవిష్యత్తు కోసం పవన్ నిలబడతారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం అప్పుల పాలై పోయింది. గత ప్రభుత్వం రూ. 13 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి వెళ్లింది. అయినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్తున్నారు. పల్లె పండగ ద్వారా గ్రామాల్లో ఓ పండుగ వాతావరణం తీసుకువచ్చి 3 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగు నీరు అందించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందించే సాయం ప్రతి ఒక్కరికీ చేరాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. యువత భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. పెట్టుబడులు వస్తేనే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం యువత పక్క రాష్ట్రాలకు వలసలుపోతున్నారు. ఉన్న చోటే ఉపాధి అవకాశాలు రావాలి. జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్ దాని కోసమే నిలబడతారు.

### మీ భవిష్యత్తు కోసమే జనసేన ఉంది

గత ప్రభుత్వంలో గ్రామ స్థాయిలో కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. జెండా పెడితే కేసులు పెట్టారు. ప్రభుత్వ పథకాల అమలులోనూ వివక్ష ఎదుర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించినందుకు రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మందిపై కేసులు పెట్టారు. మన కార్యకర్తల మీద దాడులు చేశారు. బెదిరింపులకు దిగారు. విశాఖలో మన నాయకుడిని సైతం బంధించారు. మనం చేసిన ఈ ప్రయాణాన్ని ఎవరూ మర్చిపోకూడదు. అదే సమయంలో ప్రతి ఒక్కరు కూటమి ధర్మాన్ని పాటిస్తూ.. భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీతో కలసి పని చేయాలి. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాం. బాధ్యతగా ఉండాలి. క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారం చూపాలి. జనసేన పార్టీ మీ కోసం.. మీ భవిష్యత్తు కోసమే ఉందన్న విషయం గుర్తుంచుకోండి" అన్నారు.
ఈ కార్యక్రమంలో శాసన సభ విప్ అరవ శ్రీధర్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు, వివిధ నియోజకవర్గాల ఇంఛార్జులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467